# కర్పూర వసంతరాయలు



- డా॥ సి. నారాయణ రెడ్డి

# కర్పూర వసంతరాయలు

( గేయ కావ్యం)

డా సి.నారాయణ రెడ్డి

మనస్వినీ ప్రచురణలు

హైదరాబాద్

2000

# Karpūra Vasantha Rāyalu
(Gēya Kāvyam)

**By Dr.C.Narayana Reddy**

Fifth Edition: February, 2000

Price: **Rs.60/-**

Cover Design: **Laxman Yele**

For Copies
**Visalandhra Publishing House**
4-1-435, Bank Street,
Vignan Bhavan, Hyderabad-500 001
and
**Manaswini Prachuranalu**
Plot No.48, Filmnagar Colony,
Jubilee Hills, Hyderabad-500 034

Composed at:
**Ōm Tēja Graphics**
H.No.3-13-1/4B,Srinivasapuram,
Ramanthapur,Hyd-13
Phone: 7035196.

Printed at:
**Vipla Computer Services**
*(Designers & Multi Colour Offset Printers)*
Nallakunta, Hyderabad. Ph: 7673309

**అంకితం**

రాగిరేకులలో రాతిపలకలలో
కనుమూసిన తెనుగుల చరితకు
ప్రాణం పోసిన మహామనీషి

శ్రీ మలంపల్లి సోమశేఖరశర్మగారికి

# ఐదో ముద్రణ సందర్భంగా....

## ప్రకాశకుల మాట

డా.సి.నారాయణరెడ్డిగారి ఈ విశిష్ట గేయకావ్యానికి ఇది ఐదోముద్రణ. తొలిముద్రణ 1957లో వెలువడింది. మూడు దశాబ్దాలకు పైగా తాజాగా పఠనపాఠనాల్లో నలుగుతున్న గ్రంథమిది. కవి తన పాతికేళ్ల ప్రాయంలో రచించిన ఈ కావ్యం ఇప్పటికీ యౌవ్వననైగనిగ్యంతో ప్రకాశిస్తున్నది. సినారె రచించిన గ్రంథాలన్నీ మేలిమిరాళ్లే అయినా ఆయన సాహితీజీవితంలో మైలురాళ్లనదగిన అనర్ఘగ్రంథాల్లో ఇదొకటి.

ఒక చారిత్రక ఇతివృత్త శకలాన్ని ఆధారంగా తీసుకొని దానిచుట్టూ అల్లిన అందమైన కథ ఇది. శృంగార ప్రధానమే అయినా వ్యక్తిసుఖం కన్నా దేశక్షేమం ముఖ్యం అని ప్రతిపాదిస్తూ ఆనందోప దేశాలను సమంగా పాటించిన ఉదాత్తకావ్యం. కరుణ, వీరరసాలను వెలిగించిన ఉత్తమ రచన.

మాత్రాఛందస్సుల అశ్వహృదయం తెలిసిన క్రీడాకారుడిగా సినారెను ఈ కావ్యంలో చూడవచ్చు. కవిగా కవితాశక్తీ, వర్ణనావైదగ్ధ్యం, ఔన్నత్యాలనందుకున్నది. కావ్యం మొత్తం ఒక రసఝురిగా సాగుతుంది.



అనురాగానికీ, ధర్మానికీ మధ్య లకుమ అనుభవించిన సంఘర్షణను కవి అనితరసాధ్యంగా చిత్రించారు. ప్రజాశ్రేయస్సుకోసం ఆమె విషాదాంత నాయికగా మారింది. 'లకుమ' తెలుగు సాహిత్యంలోని గొప్పనాయికల పంక్తిలో చేర్చదగింది. కుమారగిరిరెడ్డి ఎప్పుడో నిర్వహించిన వసంతోత్సవంలోని కర్పూర పరిమళాలు ఈ కావ్యంలో ఇప్పటికీ ప్రసరిస్తున్నాయి.

దీని ఐదోముద్రణకు అనుమతించిన నారాయణరెడ్డిగారికి మా కృతజ్ఞతలు.

-మనస్వినీ ప్రచురణలు.

# ప్రథమాశ్వాసం

"జయ జయ సమగ్రాంధ్ర
సర్వంసహా భార
సంభరణ శేషాహిరూపా !

పరిపంథి నృపతి దో
ర్బలకంధి మంథనా
పర మందరాద్రి స్వరూపా !

జయ జయ కళాదుగ్ధ
సాగర మనోముగ్ధ
సంపూర్ణ చంద్రమూర్తీ !

సురసరి న్మందార
సుమగరు న్నీహార
పరిహస న్మంజుకీర్తీ !

జయ నిత్య దాతృత్వ
చణతా నతానంత
సారద్రుమాగ్రశాఖా !

ప్రస్ఫురత్ బ్రహ్మతే
జస్ఫురత్ ఫాలతల
విస్ఫుర ద్రాజరేఖా !

జగనొబ్బగండ జయ
జగరక్షపాల ! జయ
జయ చెంచుమలచూరకారా !

కవి గమకి వాది వై
ణవిక వైణిక జన
స్తవనీయ కవితావిచారా !

అనవోత భూనాథ తనయాగ్రణీ !
పంటకుల పద్మసంప ద్ద్యోమణీ !
జయ కొమరగిరి ధరావరదా
జయ జయ వసంతరాడ్బిరుదా !"

ఈ గతిని విననయ్యె మాగధుల కైవారముల్
కైవారములు గావు గానామృతాసారముల్
పుష్కలావర్త జలమ్ముజ్మంద్ర నిస్తంద్ర
వాగ్ధీరముల్ : వార్ధిభావనా గంభీరముల్ .



స్తుతిరవమ్ములు జనశ్రుతిపుటమ్ముల సోకెనో లేదా
స్తోత్రగీతులు సౌధచూడాళి నెగబ్రాకెనో లేదా
కొండవీటి పురాన నుండు బండలు గూడ
గుండె గలగలలాడ 'కో' యంచు పిల్చినవి.

మనుదిన్నపాము బోలిన రాజమార్గమ్ము
ఒక మహానదివోలె ఉప్పొంగి నడచినది.
పంచభూతము లొక్కపరి 'ఓ వసంతప్ర
భూ'! యంచు మైమరచిపోయి శబ్దించినవి.

అది చైత్ర శుద్ధ త్రయోదశీ దినమంచు
అది మదనదేవ పూజారంభ దినమంచు
అది కొమరగిరి బ్రతుకుటంగణమ్మున మల్లె
లే మొల్లలే విరియు లేత ఆమనియంచు
నేను వేరుగ చెప్పనేల ?
వ్యంజనకు వ్యాఖ్యానమేల ?

పాలసంద్రపు నురుగు తరగలు
పరిమళించిన సురగజముపై
స్వారి వెడలు శచీద్వితీయుని
స్మరింపించె వసంతరాయడు.

జనసమూహము దుగ్ధసాగర
సామ్యమున మిసమిసలువోవగ
అందు రాజ్ఞీయుతుడు మధురా
యడు స్ఫురించె రమాధిపునివలె.

కడకు ఉచ్చైశ్శ్రవము నైనను
కదనులో కాల్ద్రొక్కి చను హురు
మంజి తేజీ లెక్కి అశ్విక
మండలము మును సాగుచుండెను.

నడుమ కొమరగిరీశ్వరుని దం
తావళము నడయాడుచుండెను
ఆ పిదప సైన్యాధిపతి. కా
టయ్య వేముడు సమరభీముడు.

అతనివెంట అనేక మండల
పతులు సచివులు దండనాథులు
ఆ వెనుక భూ మీనినట్టుల
హయదళమ్ములు కాల్బలమ్ములు.

ఇంక వెన్కకు ఎంత జనమో ?
ఇసుక వేసిన పిసరు రాలదు.
వారి ఉత్సాహమును చెప్పగ
వాయి చాలదు వాక్కు చాలదు.



విచ్చుకత్తుల ధాళధళ్యము
విద్యుదున్మేషమును చూపెను.
జయ నినాదము లబ్దములు లే
కయె ప్రగర్జకు దారి తీసెను.

వీటిలోన రసాల కిసల న
వీన తోరణమాల లెందును.
బాటలో నెల్లెడల పూవుల
మాటలే మరి యేమనందును?

ఏ మొగమ్మున చూపు నిల్చిన
ఇగురువోసెడు కాంతివల్లులు
ఏ సిగను పరికించి చూచిన
ఏటవాలుగ నవ్వు మల్లెలు.

యువతు లెల్లరు రతీరాములు
యువకులో మన్మథస్వాములు
నాడు నిజముగ పండుముసలులు
గూడ నవయువతాభిరాములు.

సాగెను జనవాహిని వి
స్తార రాజమార్గమ్మున
మ్రోగె పంచ మహావాద్య
ములు రోదోంతరమందున.

గవాక్ష రంధ్రమ్ము లన్ని
కనులు చేసికొని ముగ్ధాం
గనలు చూచి రా వసంత
కాంతుని రాజసమూర్తిని.

ఒక్క తలుపురెక్క తీసి
ఒయారముగ అణుమధ్యలు
మధ్యలు తిలకించినారు
మహీశ్వరుని యువమూర్తిని.

ద్వారమ్ములు డాసి త్రపా
భారమ్ములు త్రోసి ప్రౌఢ
లీక్షించిరి ఇక్షుధన్వి
కీడగు మోహనమూర్తిని.

పురపురంధ్రు లడుగడుగున
కురిపించిరి రాయలపై
పులుగడిగిన ఆణిముత్య
ముల తలపించిన లాజలు.

వృద్ధాంగన లానందము
వెల్లివిరియ మంగళాక్ష
తలు ఆశీరామృతములో
తడిపి రేనిపై చల్లిరి.



నాగరకులు జానపదులు
నారీనరు లెల్లవారు
పూలజల్లుతో రాయల
మూర్ధము నభిషేకించిరి.

ఈ రీతిగ లోకబంధు
వౌ రాయడు పౌరుల హృ
న్నీరేజముల వికాస
శ్రీరమ్యములుగ జేయుచు

సాగిపోవ సాగిపోవ
ఆగిపోయె రాచబాట.
ఆగిపోయె రాచబాట
అట నిల్చెను నగరితోట.

తోటబయట గజమ్ము దిగి విరి
బాటలో నడుగిడెను రాయడు.
అతని ఉత్తర దక్షిణమ్ముల
అనుగు రాణియు కాటవేముడు.

వారివెంబడి మదనపూజా
పర్వ సందర్శన కుతూహలు
రెంద రెందరొ సాగిపోయిరి
చందురునితో చుక్కలట్టుల.

తియ్యమామిడి మూలమందున
తీర్చి దిద్దిన మంటపము; అ
ద్దానిలో ఎత్తైన వేదిక
రేని కనులకు విందుచేసెను.

మండపము రంభాభిశోభిత
మై వసంతేశ్వరుని కన్నుల
నున్ననౌ చూపులకు తిన్నగ
వెన్న రాచినయట్లు తోచెను.

కుంకుమద్రవ సేచితమ్మయి
సంకుమద సంవాసితమ్మయి
రమ్య ముక్తావళీ విరచిత
రంగవల్లీ భంగిమమ్మయి

అర్చనావేదిక కుమార ధ
రాధినాథుని తీగవారెడు
చూపులకు పరిమళ రసమ్ముల
చూరలిడి చిరుచల్వ లూదెను.

వేదికాగత మదన మధు శివ
విఘ్ననాథాప్సరః ప్రతిమల
చూచినంత వసంతరాయని
చూపు లంతర్ముఖములయ్యెను.



మరు నిమేషము కన్ను లెప్పటి
మాదిరిగ వికసింప; సాచెను
ఒక అపాంగము రాణిపై వే
రొకటి కాటయవేముపై.

రేని మనసున కెక్కినట్టి ప్ర
ధాని కాటయవేము డాతని
బావ కావున ప్రన్ననౌ ఒక
పరిహాసము విసరె నిట్టుల.

"మృడుని మూడవకంటి చిచ్చున
బడి శరీరము విడిన మరునికి
మిమ్ముబోటి రసజ్ఞులే రూ
పమ్ము నిల్పినవారు సుమ్మా."

ఈ లలిత సల్లాపమునకు మ
హీశు డల్లన నవ్వి రాజ్ఞీ
వామభుజమును దువ్వి కాటయ
వేముతో నీ పోల్కి పల్కెను.

"కాళిదాసు శకుంతలకు పా
ఠాలు నేర్పెడు బావగారూ !
మీ రసజ్ఞత మదనదేవ స
మీపవర్తిని కాదనెదరా ?"

ప్రభువు చుట్టుగ నిల్చు ముఖముల
పైన ముసిముసి నగవు మొల్చెను
ప్రభువు కెదురుగ పొల్చు మదనుని
పైన కాంతి యెదో చిగిర్చెను.

మోహార్తికులైన విప్ర
మణుల భావమును గ్రహించి
రాయ డంత దేవతార్చ
నాయత్త మనస్కుడయ్యె.

వైదిక మంత్రాక్షర ప్ర
ణాదమ్ములు సాగుచుండె
రాజు షోడశోపచార
పూజలు కావించుచుండె.

అక్షతలిడి విఘ్నేశున కంజలించె
శివునిపైన హిమాంబువులు చిల్కరించె

గుప్పెడంత కుంకుమ పొడి
గుప్పెను అచ్చరలపైన
దోసెడన్ని పూవులెత్తి
పోసెను మధుమూర్తిపైన.



కపురపు టారతులు త్రిప్పి
గందవొడిని పైన గుప్పి
కస్తూరిని కలయహత్తి
కాలాగురు ధూపమెత్తి
రాయడు పూవిల్తుని పూజించె
రాణి నీడవోలె అనుసరించె.

అంతట సదస్యులు ర
సావిష్టులై "నమో
మదనాయ యువహృదయ
సదనాయ" అని యనిరి.

రేడు సమ్మోద చాం
ద్రీ స్నాతచిత్తుడై
అరూఢుడయ్యె భ
ద్రానేకపముపైన.

నగరాభిముఖు డగుచు రేడు
సమ్మదా
పగ తరగలం దోలలాడు.

తనతోడ నడచువా
రిని జూచి, అల్లన శి
రము నూచి, మందహా
సము చేసి, నిండు దో
సిళ్లతో మృగమద
శ్రీ చందనరజమ్ము
కుండికలతో అచ్చ
గొజ్జంగి నీరమ్ము
కుమ్మరించె వసంతనృపుడు
కుసుమించె జనచిత్త మపుడు.

తన్మయత్వమ్మె ఆ
ధారమ్ముగా సాగి
కపుర మొండొరులపై
కలయజల్లిరి జనులు.

తరుణ మిదియే యంచు
వరుస గలిసినవారు
కనుల కాశ్మీర ధూ
ళిని గొట్టి నగినారు.

ప్రౌఢాంగనలు కొత్త
కోడెకాండ్రను దరిసి
చెవులలో పన్నీరు
చిలికి పర్విడినారు.



ఎటు చూచినను కపురమే గంధమే
ఏ దెసను ఆనందమే అందమే.

కర్పూర కస్తూరి
కా చందనములతో
నేలయే కాదు నిం
గియు పరిమళించినది.

జాదర జాదర జాదర యంచును
'చర్చరి గీతలు' పాడెడు వారలు
ద్రుతతాళమ్మున ధుంతక ధుంతక
ధుంధుంకిట యని ఆడెడు వారలు.

తుమ్మెదపదములు వెన్నెలపదములు
కమ్మగ గానముచేసెడు వారలు
ఏలలు పాడుచు ఈలలు వేయుచు
సోలుచు తూలుచు సాగెడు వారలు.

ఝుల్లరి ఝర్ఝరి మోదెడు వారలు
పల్లకి వంశిక మ్రోసెడు వారలు
డమరువులను మ్రోగించుచు బల్ ఫీ
ట్కారమ్ములతో తూగెడు వారలు.

దేశిమార్గముల నృత్తనృత్యముల
తీరులు చూపుచు పోయెడు వారలు
ఆవేశముతో 'జయ వసంతరా
యా' యని బారులుదీరిన పౌరులు.

ఈ రీతిగ ఆ జనప్రవాహము
చేరె నృపాలుని శుద్ధాంతమ్మును.
ఈ రీతిగ తొమ్మిది దినములు సుమ
నారాచుని పండుగలే జరుగును.

చైత్రపూర్ణిమనాడు జానువెన్నెలరేడు
ఉదయించినాడదో మదనునకు సైదోడు.

విరహిచిత్తముల జర్జరితమ్ములుగ జేయ
దండు వెడలిన మన్మథస్వామి రథముపై
ముద్దు మూటలుగట్టు ముత్యాల గొడుగు
కొండపై అదొ వియోగుల కగ్గిపిడుగు.

వలకాక నణచికొను తలిరుబోణుల జూచి
కనులెఱ్ఱజేసినటు కంజారి అగుపించె.

తన అల్లునికి లోబడని మానుల జయించ
కారమ్ములను నూరుగతి నిశాపతి తోచె.



ఎంతవానికి వెఱ్ఱి యెత్తించు ఎరుపు వె
న్నెలలు తిన్నగ సుధాలలితమ్ములై పోయె.

వడగాడ్పులను మించు వలకాకల తపించు
విరహులకు తోచె పూవీవనలు వీచినటు.

కొంతగా తెలుపెక్కి కుముదబాంధవుడు గృహ
లక్ష్మి చిరునవ్వులీలన్ ప్రసన్నుండయ్యె.

పాలవెల్లిని దేలు పూలదోనియ లీల
ఎల్లలోకమ్ము భాసించె వెన్నెలలోన.

నురుగువెన్నెల చెదరునో యనెడు భీతితో
పవను డూపిరి బిగ్గబట్టి అడుగులు వేసె.

కొండవీ డానాటి వెండివెన్నెలలోన
కనిపించె నచ్చముగ కైలాసగిరి వోలె.

ఆ సుప్రసన్న సమయాన నగరోద్యాన
మందున కళాలక్ష్మి అందె సవరించినది.

ఒక పాలరాతి వేదికపైన వ్రేలు యవ
నిక వెండిమలపైని నీలమేఘమురీతి కన్పించె.

యవనికాభ్యంతరమునందుండి మంద మం-
దముగ వీణాదివాద్యములు శ్రుతి కూర్చినటు విన్పించె.

రంగస్థలమునందు ప్రాఙ్ముఖుండై సభా
పతి కొమరగిరి ధరాపతి నివిష్టుం డయ్యె.

అతనికి వామదిశ ఆదిసతి కెనవచ్చు
రాణి గంభీరతాస్థానియై కూర్చుండె.

కుడిప్రేవ కళలపాల్కడలి వీరావతా
రుడు కాటవేమయాఖ్యుడు నిషణ్ణుండయ్యె.

ఆ వెనక తత్తదుచితాసనమ్ములపైన
కూరుచుండె రసజ్ఞకులము
ఆరామము ప్రశాంతమైయుండె కడకు విన
గారాదు పక్షికలకలము.

ఇంతలో యవనికాభ్యంతరమ్మున నుండి
వినిపించె వాద్యమేళమ్ము.

తోటలో నిదురమత్తున నున్న గడ్డిపో
చలు లేచి చూచినవి సుమ్ము.



తొలగె ప్రక్కకు మబ్బువలె నున్న తెరయంత
నిలిచె వేదిక మెరుపువలె నున్న ఒకకాంత.

చకితుడై రాయడా జవ్వనిని గాంచె
కాటవేముడు ప్రభుముఖమ్ము పఠియించె.

గరుడుని గరుత్తులటు కరము లెత్తి పతాక
హస్తముద్రను చూపినది నర్తకి.

కటకాముఖమ్ము నొక్కటపట్టి చూపె ప
ల్లవహస్తముద్ర లీలగ నర్తకి.

తనపైన పారిజాతములు జలజల కురిసి
నటుల పులకించె నా అవనీపతి.

అంతట మ్రోగెను అలలై సాగెను
పంచమతాళము వసంతరాగము
జడప్రకృతికే యిడె గిలిగింతలు
సమస్త వాద్య క్రమసంయోగము.

"తాం తాం తాం తాం
తాం తాం తాం
తై తై తై తై తై తై తై
తాం తాం తైతాం

తకతాం త్రైతాం
తళాంగు తకధిమి
తధిగిణతోం-"

మృదంగనాదము హృదంతముల రస
నదమ్ములను కదలించె
విపంచికారుతి అపారనాద
ప్రపంచమును పలికించె.

కన్ను లరమూసి ఆ కలువకన్నులపడుచు
ముకుళముద్రను చూపె నపుడు
బొమల నించుక వంచి రమణీయముగ నర్త
కిని చూడసాగె నృపుడు.

బొమలెత్తి మెడను సొంపుగ ద్రిప్పి భ్రమర హ
స్తముపట్టి ఆమె నిల్చినది
రేని కొకభృంగి యెదలోన చొరబారి ఝుం
కృతి చేసినట్లు తోచినది.

మురజమ్ముపై నంత మ్రోగిపోయినవి బం
భరగీతివంటి ముక్తాయింపులు
ప్రకృతి ప్రత్యణువులో ప్రతినాద మిచ్చినవి
"తాం తకిటతాం" అనెడు వాయింపులు.



ఆ నాదలహరి రా
జాంతరంగమున నిండినదపుడు
నర్తకియె తప్ప అ
న్యము కానబడదు రాజునకపుడు.

రేని ముగ్ధమనస్సులోన మన్మథుని ఆ
రవ బాణ మవతరించినది
రేని స్నిగ్ధహృదంతరాన అమృతాంశు పదు
నేడవకళయె స్ఫురించినది.

ఎటులనో తనచూపు లిటుత్రిప్పి కాటవే
ముని పైన ప్రసరించె రేడు
ఇంగితజ్ఞుడు చెప్పెనేదొ ? రేని యెడంద
లో నిల్చె వర్ణములు మూడు.

రాజు పెదవులమీద 'లకుమా' యనెడు అక్ష
రము లయత్నముగ నాల్కినవి
లకుమ చరణానద్ధ రత్నకింకణులు మె
ల్లగ 'ప్రభూ' యంచు పల్కినవి.

రాణి అధరోష్ఠమ్ముపైన ఒక సోగ వె
న్నెల తున్క జారిపోయినది
లకుమ ఓఢ్యాణస్థ రత్నముకురముల చం
ద్రిక తన ముఖమ్ము జూచినది.

నిమిషకాలము వాద్యములు మం
త్రితభుజంగములట్లు నిల్చెను
సన్ననౌ మురళీస్వనమ్ము ది
శాంతముల నెవ్వరినొ పిల్చెను.

వేణురుతి ఆరోహణస్థితి నందగా
ఆ పురోద్యానమ్ము మారెను బృందగా.

ముకుళభావన నభినయించిన
లకుమ మారెను రాధగా
చూచువారికి అభినయమ్మది
తోచె నొక రసగాథగా.

మురళికాస్వర సంశ్రవణమున
మొదట స్తంభించినది రాధిక
త్రుటిని పూర్వస్థితిని గని ఉ
త్సుకత చూపించినది రాధిక.

పాట నాపడు రూపు చూపడు
బాలగోపాలకు డదేల ?
రాధ దిక్కులు చూడసాగెను
ప్రౌఢయైనను అపుడు బేల.



ఆమె విరహోత్కంఠయై "కృ
ష్ణా" యటంచును పిల్వసాగెను
అన్ని దెస లొక్కటై మరల "కృ
ష్ణా" యనుచు ఘోషింపసాగెను.

ఆమె గద్గద కంఠియై "కృ
ష్ణా" యనుచు విలపింపసాగెను
తోటలో ఒక మూల కోయిల
బోటి జాలిగ కూయసాగెను.

మురళికాస్వర మల్లనల్లన
విరిసి తారస్థాయి నందెను
రాధ తీయనిబాధతో నే
త్రములు మూసి ప్రశాంతి నందెను.

ఆమె మెరిసెడి కనులతో జ్యో
త్స్నాభిసారికగా స్ఫురించెను
ఆమె వెన్నెల యౌనొ ? వెన్నెల
ఆమెయో ? యన కానుపించెను.

పసుపుమించుల చోళ మేదీ
పసిడియంచుల చేల మేదీ
కర్ణతాటంకమ్ము లేవీ
కాంచనోద్యాణ మ్మదేదీ ?

ఆమె వెన్నెల యౌనొ ? వెన్నెల
ఆమెయో ? యన కానుపించెను.
కాదు ; వెన్నెల తరుణివేషము
కట్టెనో యనగా స్ఫురించెను.

ఆమె నల్గడ లాలకించెను
అమరగానము సాగుచుండెను
ఆమె యెదురుగ చూపు దించెను
అమృతరూపము వెల్గుచుండెను.

పరవశుండగు రాజు వెన్నెల
తరగలంబడి తేలిపోయెను
పరవశుండగు రాజు బృందా
పరిసరమ్ముల నిల్చిపోయెను.

రసజగత్తున కీశ్వరుండగు
రాజునకు తనుతాను కృష్ణ
స్వామిగా రూపొందినటు ఏ
దో మహానుభవమ్ము కల్గెను.

లకుమ రాజును చూచినంతనె
ఒకనిమేష మ్మామె తనుగత
పంచభూతమ్ముల కెదో కిలి
కించిత మ్మైనట్టు లయ్యెను.



పంచవాద్యము లొక్కమారుగ
పరవశమ్మై ఆలపించెను.
వేదిపై కృష్ణయ్య గజ్జెల
పాదములు మాత్రము నటించెను.

దొంగకృష్ణుని పైన కోపము
పొంగివచ్చెను రాధకు
లేని బిబ్బోకమ్ము బుగబుగ
లేచి వచ్చెను రాధకు.

మురళి యొకపరి మురజ మొకపరి మ్రోగెను
కాలిగజ్జెలు ఘల్లనగ మును సాగెను.

నడిచె ఖండితనాయికగ ఆ రాధిక
ముడిచె మోవిని ముడిచె మోమును రాధిక.
గోపబాలుం డేమిచేయును పాపము
చూపె తన సర్వాంగసుందర రూపము.

నంగనాచియైన కృష్ణు
నిం గనగా అల్క పొంగి
మోముడ్డము ద్రిప్పి యిటుల
పొడిచినట్టు లనెను రాధ.

'చీకటి నిలువెల్ల రూపు
గైకొనినటు లున్నవాడ
నిను తాకిన వెన్నెల మా
యును పొమ్మో మొరటుకాడ!'

ఈ పొడుపుల కే ఉత్తర
మిడు రాధాలోలుడు
హేలగ చిరునవ్వు నవ్వె
లీలాగోపాలుడు.

మంచుముద్ద వోలె రాధ
మనసు కరగి పోసాగెను
ఆమె ముఖములోని రాగ
మంతరంగమున మూగెను.

ఆమె పెదవు లరవిప్పి 'ప్రి
యా' యని సంబోధించెను.
అతడు కన్ను లరమూసి 'ప్రి
యా' యని సంభావించెను.

ఎడమవైపు రాధ నిల్చె
కుడివైపున కృష్ణుడుండె
ఇరువురికిని నడిమిచోటు
కరిగి మాయమగుచునుండె.



అతని వామహస్త మామె
అంసమ్మున అద్దియుండె
అతని దక్షిణకర మామె
అలకల సరిదిద్దుచుండె.

అతడామెను చూచుచుండె
ఆమె అతని చూచుచుండె
ఆదిదంపతుల మాదిరి
ఆ చూపులు తోచుచుండె.

సామాజికలోకము ని
స్తరంగ దుగ్ధాబ్ధియయ్యె
చేతనాజడమ్ములు స
చ్చిదానందమయములయ్యె.

అంతట మృదంగము 'ధణాధణ'మ్మని మ్రోగె
ఇరువురి పదమ్ము లొకవరుస నాడగసాగె.

తకతకిట తకతకిట
పదములిట పదములట
ఘలుఘల్లు ఘలుఘల్లు
గజ్జెలిట గజ్జెలట.

ఎల్లవాద్యములు పల్కినవి 'కృష్ణ' యంచు
ఎల్లరాగములు పిల్చినవి 'రాధా' యంచు.

అప్పుడందరి మనసుటద్దమ్ములందు చి
త్రముగ కన్పడిరి రాధాకృష్ణులే.

ఆగిపోయెను వేణుగానము
ఆగెను విపంచినిక్వాణము.

సాగిన దొకేఒక మృదంగము
మ్రోగినది దాని సర్వాంగము.

ద్రుతలయను పల్కెను మృదంగము
ఆడినది లకుమ చరణాంగము.

ప్రభువు తన్మయుడయ్యె
ప్రభువు చిన్మయుడయ్యె
ప్రభువు లకుమాలగ్న
పంచప్రాణుండయ్యె.

ఆత డామెనుజేర అడుగు నించుక లేపె
రాణి ఆతని భుజాగ్రాన చేయిని మోపె.



ఒక్కమారుగ ప్రభువు
ఉల్కిపడి తను తాను చూచికొనె.

ఒక్కమారుగ లకుమ
ఒయ్యారముగ తా నిలిచిపోయె.

ఒక్కమారుగ జన
మ్ముప్పొంగి హర్షధ్వనులు చేసె.

ఒక్కమారుగ పవను
డూర్చి తనువార్చి యాలలు వేసె.

లకుమ కించిన్నతశిరస్కయై శ్వాసధా
రాముహుస్పందితోరస్కయై నిల్చుండె.

పాలసంద్రపు నురుగుపైన తేలిన యింది
రను గనిన శ్రీవిష్ణువును బోలె నారాజు.

తనకొరకు తపముచేసిన పార్వతి సమక్ష
మున నిల్చిన మహేశ్వరుని బోలె నారాజు.

సార్వభౌముని రాజస మ్మడుగుపట్టినది
అతిమసృణ రసలోలుపత పైకితేలినది.

రేని కంతట అనుగురాణి కన్పడలేదు
రాణియును సర్వసేనాని కన్పడలేదు

సర్వంసహాఖర్వ ధూర్వహుండని తనను
కనులలో నిలుపుకొను జనులు కన్పడలేదు.

కన్పడె నొకే లకుమ; కన్పడెను తన కంఠ
మున ఇంతలేసి కనులను జూచు హారమ్ము.

రత్నహారము తీసి రాజు వేదిక డాసె
తలవంచి లకుమ అడుగులు ముందునకు వేసె.

దండతోపాటు కరదండయుగళము గూడ
లకుమ గళమందున అలంకరణమై పోయె.

ఉండియుండి జనమ్ము లొకసారి అంబరము
దద్దరిల హర్షనాదమ్ము లిడినారంత.

సిగ్గుతో తలవాల్చి మొగ్గయయ్యెను లకుమ
నవ్వలేకయె లోన నవ్వుకొన్నది రాణి.

నింగిలో తారాధినేత పల్చని మొయిలు
ముసుగుతెరతోడ మోమును చాటు చేసుకొనె.

# ద్వితీయాశ్వాసం

నాటిరేయి కుమారగిరి రా
ణ్మౌళి కన్నుల రెప్పవాలదు
ఎపుడొ దాటిన దర్ధరాత్రము;
ఎగియు ఊహలరెక్క వాలదు.

కనులుమూసిన కనులు తెరచిన
కానుపించిన దొక్కరూపే
ఎన్నిదిక్కులు చూచినన్ బ్రా
ప్తించినది తన మూగచూపే.

ఎపుడువీచిన గాడుపే కద
ఎందుకో నేడంత వాడి ?
ఎపుడుకాచిన వెన్నెలేకద
ఎందుకో నేడంత వేడి ?

జామురాతిరి ముందు పొన్నున
చల్లినట్టి ప్రఫుల్ల మల్లిక
లేలనో మధురాయలకు ప
ల్లేరుగాయల తీరు దోచెను.

చంద్రుడొక్కడు; అతనిచుట్టుగ
చంక్రమించును వేలచుక్కలు.
లకుమ ఒక్కతె; ఆమెచుట్టుగ
లాస్యమాడెను లక్షఊహలు.

కాటవేముడు లకుమ పేరును
కర్ణముల కందించినప్పుడె
ముద్రపడియెను మూడు వర్ణ
మ్ములు మనస్సున ప్రణవమట్టుల.

అల్లనాటి పురూరవుని ముం
దవతరించిన ఊర్వశికివలె
నేటికొమరగిరీశ్వరుని దృ
గ్వాటిలోపల లకుమ నిల్చెను.

ఆమె నృత్తము ఆమె నృత్యము
ఆమె సాత్త్విక భావనాట్యము
మరలమరల స్మరించి భూపతి
మరులుగొల్పగ పొరలె పాన్పున.

"వెండిగజ్జెల రవళియే క
వ్వించునా నన్నింతగా?
గుండె గజ్జెలలోన చొరబడి
యుండెనేమో వింతగా.



వట్టి కనుబొమ లంతగా నిల
బెట్టి నను ప్రశ్నించునా?
కుసుమబాణుని ధనువులవి; కా
కున్న నను వేధించునా?

ఆటవెలదుల యింటిపడు చే
నాటికైనను కాదు లకుమ
శప్తయై దివినుండి భువిపై
జారివచ్చిన అచ్చర సుమ."

ఓహరి సాహరిగ
ఊహలు చెలరేగ
ఉస్సురనుచు రేడు
ఉమ్మలించినాడు.

ఈ ప్రక్కకు పొరలె
ఆ ప్రక్కకు పొరలె.
పాన్పుగాదు చంద్రనిప్పు
పై ఆతడు దొరలె.

నేల నిదురవోయె
నింగి నిదురవోయె.
గాలి నిదురవోయె రేడొ
కండె అదరిపోయె.

వీట సద్దుమణగె
తోట అణగిపెణగె
ఒక చకోరి ఆర్చె
ఒడయడు నిట్టూర్చె.

అందె ఘల్లుమనెను పతి యె
దంద జల్లుమనెను
పాటరవళి తోచె; రేడు
పాన్పునుండి లేచె.

తనప్రక్క ఏదొ కదలినచప్పు డాలించి
రాజు గ్రురున తిరిగి రాణిని విలోకించె.

పండువెన్నెల నీటిపాయ లోపల నీది
ఆమె కన్నులు మెరసియాడె మీనములట్లు.

దోషివలె నృపతి యెంతో కుంచితాంగుడై
తలద్రిప్పుకొని మేను తల్పమ్ముపై వాల్చె.

'ఇంతసేపామె తన్నే పరీక్షించెనా?
తనవికారముల నాతన్వి గమనించెనా?'

తబ్బిబ్బుపడె నీవిధాన భూజాని
కనుమొగిచె తలగడ మొగమ్ముపై నూని.



కనులు కష్టమున మూసెనుగాని ఝంఝాని
లముకన్న స్వేచ్ఛమైన మనస్సు నెటుమూయు.

పరిపరివిధాలుగా భావించి భావించి
ధరణీశ్వరుని మనసు తంద్రాళువైపోయె.

రాజకార్యధురాభరణమం దలయు రేడు
ఈరీతిగా అలసె ధీరలలితుడు గాన.

రాజుమనసునకు విశ్రాంతి నివ్వగలేని
తానెందుకంచు చంద్రముడు తలవంచుకొనె.

నిజచంద్రికలు రాయనికి కనీసము దౌత్య
మూలకమ్ములు గాకపోయెనని వాపోయె.

నామసామ్యమ్ము స్మరణకువచ్చి వెలవెల్ల
నైపోయి హరిణలాంఛను డస్తముఖుడయ్యె.

భూదివములకు ఆసువోసినట్టుల తిరుగు
ఊహలకు తమరెక్క లూడిపడినట్టులై

చతికిలంబడెను రా
జన్యుని హృదంతరాళమున.
ప్రభువు పయనించె ని
ద్రా నూత్నజీవగోళమున.

జలదసోపానాగ్ర సంగత
చరణుడై అలనల్ల రాయడు
సాగిపోయెను కోటితారా
స్థగిత గగనజగత్తలమ్మున.

రాజహంసీ కాంచన గరు
ద్వీజిత మరున్మాలికా వి
భ్రాంతుడై భూకాంతు డంతట
రత్నమయమండపము గాంచెను.

చంద్రకాంతశిలా వినిర్మిత;
మింద్రనీలమణీ విభాసిత;
మావితర్దికపైన చీమయు
అడుగువేసిన జారిపోవును.

ప్రభువు దృక్శృంగాటకమ్మున
రంజనము గూర్చినది వేదిక.
దానిపై హేలామనోజ్ఞ దృ
శానుభాసి నితంబినీమణి.

కన్నుగిల్పక తన్నుజూచెడు
కామినీ మదిరాత్త వీక్షణ
భార మోపగలేక ఆమెను
పట్టుకొన నుంకించె రాయడు.



వారుణీ రసపానశోణము
లారమణి నేత్రాంచలమ్ములు
నిప్పులుమిసెను; రాజొకండే
నిలిచిపోయెను చకితుడై.

'అనిమిషాంగన యంచు నెంచక
అశ్రుసాచితి నెంత బేల' న
టంచు పశ్చాత్తప్తుడౌచు ధ
రాధిపతి గమియించెను.

పోవంబోవ కనంబడె
పుష్పవాటి ఒకటి ముందు.
పూచిన విరికన్నెలన్ని
పూర్ణాయువు నొందు నందు.

కోకిలాది శకుంతముల
కాకలీస్వరములు తప్ప
వేరుగొంతుకలు పల్కిన
తీరు కానిపించ దచట.

గువ్వల మవ్వపు వ్రేళుల
కొసల తాకిడులను తప్ప
అచటి చిగురుకొమ్మలు అ
న్యస్పర్శ నెరుంగలేదు.

ఆ వాటీకోటీరత
అవనీపతి అంతరంగ
మున కణ్వాశ్రమోద్యాన
మును స్ఫురియింపగజేసెను.

కలికమ్మనకైన మనిషి
అలికిడి వినరాని తోట
యెదలోపల రేనికి ప
య్యెద కదలినయట్లు తోచె.

వ్యక్తిదిదృక్షా గమనుడు
వసుంధరారమణు డెదుట
చూచెను మునికన్యవోని
సుందరిని; లతాతన్విని.

ఆ ముగ్ధాంగన పురుషుని
అలికిడి వినెనో లేదో
మరుచ్చలిత కుసుమితలత
మాదిరిగా కదలిసాగె.

కనులకు చాటైన కన్ని
యను గాంచగనేగి రేడు
చేలచెరగు పొదరింటను
చిక్కుపడుట చూచినాడు.



సిగ్గొక్కట భయమొక్కొక్క
చెరగున ముంచుకొనిరాగ
విభీతహరిణేక్షణ ఆ
వ్విభునిగాంచి మోమువంచె.

అళికుంతలయైన శకుం
తలనుబోని కన్యనుగని
తనలోతానే దుష్యం
తునిగా నూహించె రాజు.

ఝటితిగమనుడై ముందుకు
సాగి ఆమె వసనాంచల
మును మెల్లగ చిక్కుదీసె.
తనయెదలో చిక్కుబిగిసె.

అతనిచేతిలో అంచల
మట్టులనే నిల్చియుండె.
ఆమె కన్ను లింతలుగా
అట్టులనే నిల్చియుండె.

ఆమె ఆమెగాక వేరు
భామినిగా రూపొందెను.
రేడు తన్నుతాను నమ్మ
లేక విస్మయమ్మందెను.

ఆమె లకుమయై సాగెను
ఔను లకుమయై సాగెను.
ప్రభువంతట 'లకుమా' యని
వసనాంచలమును లాగెను.

పాన్పుపైన రాణి 'ప్రభూ
ప్రభూ' యంచు పిలిచెను.
భుజము తట్టి హెచ్చరించి
మోమును స్పర్శించెను.

రాజు కనులు విప్పి చూచె
లకుమలేదు  రాణి తోచె.
క్రుంగి; చేతిలోని రాణి
కొంగునంత జారవిడిచె.

మందమ్ముగ వైతాళిక
బృందగీతి మ్రోగుచుండె
నాలుగు దెసలన్ ద్విజ మం
గళరావము సాగుచుండె.

రాణి పెదవిపైన విశద
మైన నవ్వు తలయెత్తెను.
రేని ఆననమును వికృత
మైనసిగ్గు ముంచెత్తెను.



ఇచట రాజునుబోలె లకుమయు
అచట వె్రిగ పొరలె పాన్పున.
ఆమెకు అదే అర్ధరాతిరి
అవే తారలు అదే జాబిలి.

సూటిగా తన కనులలోనికి
చూచెనిప్పుడు కలువరాయడు.
సూటిగా తన మనసులోనికి
చూచెనపుడు వసంతరాయడు.

నాయికకు పరిణయముహూర్తము
డాయునప్పుడు ప్రియసఖులు గిలి
గింతలిడినటు తోచె వెన్నెల
దొంతరలు లకుమామనస్సున.

ఎపుడు చూచిన చంద్రుడేమరి
ఎపుడుపూచిన తారలే నే
డెందుకో అవియెల్ల అమృత
స్యందులై డెందము గలంచెను.

ఎపుడు వీచు సమీరమే నే
డేలనో ఆకాశసింధు ప్ర
షత్ప్రసిక్త మరాళమ్మదు కాం
చన గరుత్మత్తను వహించెను.

ఈ విధాన మరందతుందిల
భావనలతో ఆమెడెందము
సాంద్రచాంద్రీడోలికల ని
స్తంద్రముగ ఉఱ్ఱూతలూగెను.

ఆమె మెడలో రత్నహార మ
నంత సుందరతా రహస్యము
లెడదలోపల ముడుచుకొని యే
మెరుగనట్టుల చూచుచుండెను.

రాజమణి రాసిక్యమున కీ
రత్నహారమె వైజయంతిక.
తన రసాభినయమ్మునకు ప్రభు
తన్మయత్వమె వేలకానుక.

ఎచట నర్తకి? ఎచట వార్ధిస
మీడిత క్ష్మానాథరత్నము?
తానెచట; సుకళాపయోధి క
ళానిధి వసంతేశు డెచ్చట?

ప్రభువు గ్రైవేయమును తనకై
స్వయముగా కైసేసినప్పుడు
అతని చూపులతీపి నోపక
నతభ్రువు తానయ్యె నెందుకు?



రేనిపాణియుగమ్ము తనమెడ
పైన త్రుటికాలమ్ము నిల్చిన
యపుడు మొల్చిన పుల్కలకు భా
ష్యమ్ము చెప్పగ తనవశమ్మా?

ఎన్నిమారులు గజ్జెకట్టి న
టించలేదు? మరేలనో అపు
డంతరంగమునందు డమరువు
లదరినట్టుల స్ఫురణమయ్యెను.

తాను రాధగ అభినయించిన
తరుణమందున ధరణిపాలుడు
వేణుగోపాలుడుగ రంగము
పైన దోచుట ఎంతచిత్రము.

అదరిపోయెడు తాను రాయల
మదనమంగళమూర్తిలో వం
శీధరత్వము వ్యంగ్యముగ భా
సించినంతట శాంతినందెను.

నర్తకిగ తా రేని దృగ్గం
గమున గజ్జెలు కట్టునా యిక
లకుమగా తా రాజునకు కపు
రంపు టారతి పట్టునా యిక.

అంత అంబరమందు ఒకరే
డచ్చు వెన్నెల లొల్కబోసెను.
అంతరంగమునందు ఒకరే
డలతినవ్వుల నారబోసెను.

మింట రాజుముఖమును పల్చని
మేఘశకలము కప్పివేసెను.
ఇంట లకుమముఖమ్ముపై ప
య్యెదచెరంగు ముసుంగువేసెను.

నిదురవోయినది లకుమ
నింగికెగిసినది లకుమ.
తారాసుమాలు దూసె
ధమ్మిల్లమందు ముడిచె.

మదను డొకవంక తోచె
తన లేత
యెదలోన పూలు పూచె.

అధిపు డొకవంక తోచె
తనలోన
అమృతపవనమ్ము వీచె.



పరమశివు డెదుట నిల్చె
తానంత
భక్తితో శిరము వాల్చె.

నిటలనేత్రమ్ము మెరిసె
తన మేను
నిలువెల్ల నిప్పులుమిసె.

కంకాళధరుని మెడలో
నాగపూ
త్కారముల్ విన్పట్టెను.

తన శిరోలంకరణమౌ
నాగమణి
ఫణివోలె బుసకొట్టెను.

ప్రాకె నాపాము మెడపై
లకుమ ఒడలెల్ల జడుపై
కెవ్వుమని కేకనిడెను
ఉవ్వెత్తు ఎగిసిపడెను.

కన్నులు విప్పెను లకుమ ప్ర
కంప్యమాన మానసయై
దిక్కులు చూచెను లకుమ అ
తిస్విన్న శరీరకయై.

తనమెడలో పాము లేదు;
ధరణీశ్వరదత్త రత్న
హారము మాత్రము జాలిగ
ఆమెనే విలోకించెను.

పూర్వవాసనావళి గు
ప్పున తనలో గుబాళింప
ఆమె హారమును కన్నుల
కద్దుకొనెను ముద్దుగొనెను.

లకుమాస్వప్నము తునాతు
నకలైపోయిన తీరున
రేయి వెలిసిపోయి వెల్గు
రేకలు విచ్చెను తూర్పున.

లకుమ తనూలతపై స్వే
దకణమ్ములు ఇంకినటుల
తెలివెన్నెల లారిపోయె
కలువల కనుమోడ్పులందు.



కర్మసాక్షి లోకము రా
గమయమ్మని నిరూపించె.
కనువిప్పను పాఠమ్మును
కంజాతము లాలపించె.

రాయని గుప్త ప్రతాప
రశ్మి పరుల కెత్తిచూపు
లీల కొండవీటి శిఖరి
పాళి రంజితమ్మయ్యెను.

కాల విహంగమరాజము
రేలు పవళ్ళనెడు వింత
రెక్కలెత్తి దిక్కుల బడి
రివురివ్వున ఎగిసిపోయె.

కొమరగిరీశ్వరునికి మా
త్రము నిత్యము చైత్ర శుద్ధ
పూర్ణిమయే తన కన్నుల
ముందుగ ఆభాసించెను.

వాడినకొలదిగ వకుళము
పరిమళమ్ము పెరిగినట్లు
లకుమాగత సంస్మృతి రే
నికి మించెను అనుదినమ్ము.

ఒక్కనాడు రాయని కేదో
ఊహ తటిల్లతయై విచ్చెను.
ఆ సౌదామని కాంతులలో
అనుగుబావ స్మరణకు వచ్చెను.

కాటయవేముని రప్పించుట
కై కాలే దొకగడియయును.
కాటయవేముడు వీతెంచుట
కై కాలే దరగడియయును.

'బావా వచ్చితివా' యన 'అ
ప్పా! రానేవచ్చితి' ననగా
స్ఫురియించెను క్షీరసరస్సులు
ముచ్చడలాడినవో యనగా.

కొమరగిరియు కాటయవేముడు
సమపీఠమ్ముల కూర్చుండిరి.
ఇలువెల్పల వారెవరైనను
ఇంట బావమరదులె కాదా.

ఎంతో మాటాడగ నెంచియు
ఏమియు మాటాడడు రాయడు.
ఆత్మీయులముందర మాటల
కంతగా ప్రసక్తియె ఉండదు.



'సెలవిం'డని పల్కెను వేముడు
సెలవివార నవ్వెను రాయడు.
అపుడు వార లుభయులు వెల్గిరి
అభినవ నరనారాయణులన.

'మొనమొన్నటి పున్నమరాతిరి
ముగ్ధాభినయమ్మునుగూరిచి
నీ యభిమత మేమున్నది బా
వా' యని ప్రశ్నించెను రాయడు.

చిరునవ్వును వాతెరచాటున
చేరిచి వేముడు ఇట్లనియెను
'మీ యొసగిన మణిహారమ్మే
మా యభిమతమున కొకతూనిక.'

అంతట రాయడు వచియించెను
'ఆలంకారికు లేమన్నను
లక్షణయో వ్యంజనయో లీ
లామాత్రముగా భాసించును.'

'నాలుగుమాటలు గిల్కగనే
అలంకారికుడను నేనా?
ఇంతదాక మీ వైదుష్యము
అంతర్ముఖ మంతియెకాదా'

అని వేముడు ముందనబోవగ
అవనీపతి ఇట్లనె "ఔనౌ,
నది బహిర్ముఖత్వము పొందెడు
అవకాశము వచ్చెను బావా!

సకల కళాసంగమతీర్థము
లకుమ యనెడు మొన్నటిచిన్నది.
ఆమెను రాజనర్తకిగ చే
యగ నభిలాషము నాకున్నది."

ఈ పల్కులు కాటయవేమున
కించుక అప్రియమ్ములయ్యెను.
అనుకొనకుండగనే ఆతని
కను లాకుంచితమ్ములయ్యెను.

'ఆలోచన యేమిటి బావా'
అని రాయడు వెంటనె అడిగెను
'ఏమిలేదు తగిన ముహూర్త
మ్మెపుడా యని చూచితి' ననియెను.

ఈ మాదిరి వేముడు కొమరగి
రీంద్రుని సంతుష్టుని జేసెను.
లకుమాకరకంకణ క్రేంకృతి
ఎకిమీని మనస్సున మ్రోసెను.



లకుమ ఇక రాజన
ర్తకి యౌ ననెడు వార్త
వెల్తురట్టుల కొండ
వీట వ్యాపించినది.

లకుమ కావార్త క
ల్పనెలంత కంటి పా
పలపైన పాల వె
న్నెల సోకినటులయ్యె.

రాణి కా వార్త క
ల్పనెలంత చెవులలో
ఖరకరుని అశ్వరిం
ఖల చప్పుడుగ తోచె.

# తృతీయాశ్వాసం

నాడు రాయల కొల్వు కిటకిట
లాడుచుండెను; సచివులును సై
న్యాధిపతులు కళావ్రతులు అ
ర్థాసనమ్ముల నధివసించిరి.

చాల కాలమ్మయ్యె రాయడు
ఓలగమ్ము ననుగ్రహింపక
నాడుమాత్రము పచ్చ రా సిం
గంపుగద్దె నలంకరించెను.

రేనిలో వెల్తురుల మేడలు
రాణిలో తిమిరంపు నీడలు.
కాటవేమునిలోన రెండును
కలిసిపోయిన సందెజాడలు.

ప్రభువు నాటి సభాముఖమ్మున
లకుమ కొసగును రాజనర్తకి
పట్టమును; నిజ రసికతాసం
బంధిగంధము ఉల్లసిల్లగ.



మ్రోల మంగళతూర్యగానము
మ్రోయుచుండ సభాప్రవేశ
ద్వారముఖమున లకుమ సాలం
కారయై సాక్షాత్కరించెను.

ముందుగా సుందరులు పూవుల
ప్రోవులను విరజల్లుచుండగ
లకుమ నడచెను పాలవెల్లి త
రంగముల ఊర్వశి విధమ్మున.

భూసురుల పుణ్యాశిషారవ
ములు సమాప్తము లైనపిమ్మట
కాటవేముడు రాజునకు బం
గారుపళ్లెర మందజేసెను.

చీనిచీనాంబర సువర్ణా
ధ్యాణ కంకణ కింకిణీ యుత
మా పసిడి పళ్ళెరము నిజ హ
స్తాబ్జముల రే డొసగె లకుమకు.

లకుమ ఈషన్నతముఖాంబుజ
లక్ష్మియై కించిత్ సముద్గత
పక్ష్మయై రాసిక్యరాశికి
ప్రభువునకు అంజలి ఘటించెను.

రెడ్డివంశపు తీవి ప్రోవై
రేడుగా రూపొందెనో యన
కొమరగిరిభూజాని నిల్చె ని
గూఢహాస నిరూఢముఖుడై.

లకుమ వెనువెన్కలకు తగ్గెను
రాజు చిత్తము ముందు మొగ్గెను.
అయిన ఆతడు కదలడయ్యెను
అపుడు ధీరోదాత్తుడయ్యెను.

ఉత్సవమ్మ్ము ముగిసె రేని
ఉత్సాహ మ్మెగిసె.
లకుమాగత వాంఛావళి
చికిలివారి మెరిసె.

ఆమె సాన్నిహిత్యమ్మున
అనవరతము సాగి
ఆమె కాలిగజ్జెలలో
అహర్నిశలు మ్రోగి

బ్రతుకును సౌరభలహరీ
ప్రతిగా మహతీమధుర
శ్రుతిగా మలచంగ రేడు
కుతుకంపడినాడు.



ఏదో వ్యాజమ్మున లకు
మా దివ్యాభినయామృత
శీకరరింఛోళికాభి
షేకము వాంఛించె రేడు.

కాటవేము నొకనా డే
కాంతమందు పిలిచి తెలిపె
తనలో చిగురించిన తీ
ర్థప్రసేవనాకాంక్షను.

కాటయవేముడు దానికి
కాదనలే దౌ ననలే;
దతని మౌనమును అంగీ
కృతిగా గ్రహియించె రాజు.

మరునాడు ప్రభుండు కాంచ
న రథారూఢుం డయ్యెను.
బహుచిత్ర మ్మతనిప్రక్క
పట్టమహిషి లేదయ్యెను.

రాజరథమువెన్క అన్య
రథమొండు విరాజిల్లెను.
అందు రేని బహిఃప్రాణ
మైన లకుమ శోభిల్లెను.

రాణికి ఈ సంగతి క
ర్ణచపేటముగా వీచెను
ఆమె కపుడు పగలైనను
అర్ధరాత్రముగ తోచెను.

'అర్ధాంగికి చేసెడి మ
ర్యాద యిదేనా ప్రభూ!
పట్టమహిషి అన్నందుకు
ఫలిత మిదేనా ప్రభూ!'

కుమిలికుమిలి తనలోనే
గొల్లున ఏడ్చినది రాణి
కాటయవేముని రాకను
గని కన్నీరణచె రాణి.

అచట ప్రభువు ఆశ్వీక నా
యకుని ముఖమ్ము పరికించె.
హయరింఖాటంకృతి ఘుం
టాధ్వముల ప్రతిధ్వనించె.

రథద్వయము త్రుటిలో నగ
రంపు టెల్లలను మించెను
స్యందనధూళియె భటులకు
ముందుత్రోవ చూపించెను.



రథచక్రమ్ముల పోలిక
రాత్రులు పగళులు మించెను
బండికండ్లవోలె ధరా
పతి ఊహలు భ్రమియించెను.

రాజురథము ముందో దిన
రాజురథము ముందో యన
కదనుదొక్క జవనఘోట
కవ్రజ మ్మనుక్షణమ్ము.

రాజువాజులే ఝుంఝా
ప్రభంజ నోద్వేగభంజ
కములై మార్తాండుని గు
ఱ్ఱముల దుమ్ములో గలిపెను.

శ్రీమదహోబల నరసిం
హామలాద్రి చరణాంతిక
మందు వసుంధరాప్రియుని
స్యందనమ్ము నిల్చిపోయె.

అతిధావన పరిశ్రాంత
మై సూర్యుని అశ్వసప్త
కము నెత్తురు గ్రక్కననగ
కడ సందియ యెక్కువారె.

ప్రభువు, లకుమ, వారల
పరివారము పులకించిపోయె
సాయంసంధ్యారణిత
స్వామ్యాలయ ఘంటలు విని.

ఆ రాతిరి రాతితిన్నె
పై రాయడు శయనించెను.
పూలసెజ్జకన్నను అతి
వేలసుఖ మనుభవించెను.

భవనాశినీధునీ పావనపయ స్నాత
ములు ప్రభాతాలసానిలపోతములు వీచె.

సుఖనిద్రనున్న రాజునకు ప్రాతస్సమీ
రములు వైతాళికత్వమును నిర్వర్తించె.

నిదుర మునిగిన లకుమ నీలాలకలతోడ
కోడెగాడుపులు దాగుడుమూతలాడుకొనె.

రాజు శయ్యను వీడి లకుమశిబిరము చేరె
నిదురనున్నను ఆమె వదన మబ్జము మీరె.

ప్రభువు ఆమెకు సమీపమున చేరెనా లేదొ
చిలిపిపవనుం డామె చేలాంచలము ద్రోసె.



ఉలికిపడి ఆమె కన్నులు విప్పి చూచినది
తన కట్టెదుట మన్మథద్వితీయాకృతిని.

అతిసంభ్రమమున ఆ యందాలబరిణ తన
కొంగునకు బదులుగా ముంగురులు సవరించె.

ప్రభువు పక్కున నవ్వి ప్రశ్నించె 'ఓ లకుమ!
ఈ రాతిపై నీకు ఇంత నిదురా?' యనుచు.

ఆమె సిగ్గరి కాన ఆమెపానుపుపైన
ఇంక నిదురించు పూలే బదులుపలికినవి.

పూలప్రత్యుత్తరమ్ము కుశాగ్రమతి యైన
ప్రభువునకు మాత్రమ్మె పరమహర్షము గూర్చె.

ప్రభువును లకుమయు స్నానములాడిరి
భవనాశినీ మహాధునిలో.
అహోబలుని చరణసేవకైదివి
నవతరిలిన మందాకినిలో.

భవభయపాపజ్వాలాహారులు
భవనాశినిలో పారెడు నీరులు.
భవరుక్పీడిత జనౌషధమ్ములు
భవనాశినిలో పయఃపథమ్ములు.

స్నాతశరీరులు స్నాతాంతరులై
ధౌత సువర్ణ నవాంబరధరులై
ప్రభువును లకుమయు నేగిరి లక్ష్మీ
వనికిన్ బారెడు ప్రొద్దగులోపల.

నరహరిపూజకు పుటిలో తులసీ
మరువకదళములు నించెను లకుమ.
దోసిలినిండుగ త్రుటిలో మల్లెలు
దూసి సమాఘ్రాణించెను ప్రభువు.

మల్లీకుసుమభరోల్లోల జటా
మందగమనయై నడచెను లకుమ.
మల్లీకుసుమసమాగత సౌరభ
మత్తచిత్తుడై నడచెను ప్రభువు.

తన తాతయు ప్రోలయవే
మన్నపాలుడు నిర్మించిన
మెట్లపైన కాల్మోప సు
మించెను రాయల మనస్సు.

లకుమ వెంటరా నహోబ
లస్వామి మహామందిర
శిఖరచ్ఛాయలను రేడు
శిశిరీకృతచిత్తుడయ్యె.



మందిరాంతరమున రేని
ముందు విరాజిల్లుచుండె
ఆగమశిఖరాగ్రసింహు
డగు లక్ష్మీ నరసింహుడు.

ఒక్కవంక కోటిభాస్క
రోద్ధతద్యుతిచ్ఛటాతి
గాములైన కౌస్తుభమణి
కాంతులు దొంతరలువోవ

ఒక్కదెస హిరణ్యకశిపు
డొక్కను జీల్చిన పవిధా
రానిశాతనిష్ఠుర నఖ
రమ్ములు మిరుమిట్లు గొల్ప

నరసింహుడు స్ఫురియించెను
నరనాథుని భక్తి భర
ప్రణతాత్మకు చిత్రమైన
రమ్యభయానకమూర్తిగ.

మునిమనస్సరోవర ఖే
లన మరాళరాజమైన
నరసింహుని వినుతించెను
నరపతి తన్మయత నంది.

"ద్వితీయ వైకుంఠ మ్మన
తేజరిల్లు అహోబల
క్షేత్రమ్మును స్థిరవసతిగ
స్వీకరించితివ దేవా?

రాక్షసువక్షమ్ము చీల్చి
రక్తము నెగజల్లు నిన్ను
సురలు మును 'లహోబల' యని
స్తుతించినారట దేవా.

ఆమ్నాయమ్ములు నాలుగు
సాకృతులై నీ గుణమ్ము
లాలపించ ఈ గిరి వే
దాద్రిగ పేరొందెనంట.

నాకువలెనె మీకు వసం
తమహోత్సవములు మనఃప్రి
యమ్ము లనుచు పురాణమ్ము
లాలపించినవి దేవా.

భక్తుల ముంగొంగు పసిడి
వై వెలసిన నరసింహా!
దీనుని జేజేలు కృపా
ధీనత గైకొనవయ్యా!"



ఈ రీతిగ కొమరగిరి ధ
రేశ్వరుండు జోతలిడగ
అంతర్ముఖియై లకుమ జ
నార్దనమూర్తిని నుతించె.

ధృతి శాంతియు దృష్టియు స
న్మతి యను నెచ్చెలులతోడ
వేదవేద్య అంకపీఠి
వెలసిన లక్ష్మిని భజించె.

శ్రీనాథుని క్షీరధార
తో నభిషేకమ్ము చేసి
భూసురులకు హిరణ్యాది
పుష్కలదానములు చేసి

అర్చకు డెత్తిన కపురపు
టారతి కన్నులకు నద్ది
అత డొసగిన తులసీ తీ
ర్థాదికములు స్వీకరించి

రాయడు శిబిరమున కేగెను
లకుమ అతనివెంట సాగెను.

ఆనాటి చరమ సం
ధ్యావేళ కొక గడియ ముందు.
గజ్జెలు 'కుణుక్కు' మనె
కళ్యాణమంటపము నందు.

లకుమ నిల్చెను చెంచు
లక్ష్మిగ అలంకరించుకొని
కటిచుట్టు నెమలి యీ
కలమేఖలను బిగించుకొని.

మృగచర్మ వసనయై
మృగతరళ నయనయై నిలిచె.
తలపైన అడవి మ
ల్లెల బేలచిరునవ్వు పొలిచె.

సిగ నొక్కవంక కొం
చెము పైకి ఓరగా నుంచె.
జగదేక లక్ష్మియె
సాక్షాత్కరించె ననిపించె.

ముక్తభూషణయై వి
ముక్తేతరాలంకరణయై
నర్తించు లకుమ నా
నరవరుడు చూచె అనిమిషుడై.



అడుగువేసెను చెంచులక్ష్మి
అడుగుతీసెను చెంచులక్ష్మి.

అడుగు వేయుటతోనె
అందెలు ఖణిల్లుమని మ్రోగినవి.
అడుగు తీయుటతోనె
అందెలు కుణిల్లుమని మూల్గినవి.

అందియలరవళులా ఇందిరాహృదయార
విందమ్మునకు భాష్యముల్
ఆమె నును
డెందమ్మునకు వశ్యముల్.

ఆమె వాసకసజ్జయై నిలిచెను
స్వామికై యెదురుతెన్నులు గాచెను.

మృగమదము తడియారిపోయె
సిగపూలు ముడుచుకొనిపోయె.

'సామీ!' యనుచు పిలిచెను
తరులన్ని
'సామీ!' యనుచు అరచెను.

'సింగా!' యనుచు పిలిచెను
గిరులన్ని
'సింగా!' యనుచు అరచెను.

స్వామి రాడేమో యిక
ఆమె ఖండితనాయిక.

రింగురింగున మ్రోగె అందెలు
ఖంగుఖంగున మ్రోగె అందెలు.

చెంగుచెంగున నృత్త
భంగిమలు చూపి చలి
తాంగియయ్యెను చెంచులక్ష్మి
విరహాన
క్రుంగిపోయెను చెంచులక్ష్మి.

చెంగటనె అంత నర
సింగడే నిల్చుండ
కంగారుపడె చెంచులక్ష్మి
కోపారు
ణాంగియయ్యెను చెంచులక్ష్మి.

సింగ డామెకు చేరువను చేరె.
'చుంగు తగులును పొ'మ్మనుచు దూరె.



సింగ డామె కరమ్ము చేతగొనె.
'దొంగ పోపో దూరముండు' మనె.

కడకు బాసను చేసె నరసింగడు
పడతి కాసను రేపె నరసింగడు.

ఆమె సింగని ప్రశ్న లడిగె
అత డన్నిటికి బదులు నుడిగె.

'మోముపై శ్రీగంధ
మున్న దెక్కడిదిరా? సింగా!'
'పూలపొడి తప్ప యే
ముండునే? నా సామిరంగా.'

'తలపైన కురులు చి
క్కులుచిక్కు లైపోయెనేలా?'
'పులితోడ పోట్లాడ
వలసి వచ్చెనె చారుశీలా!'

'చెక్కిలిని నొక్కినటు
చిన్నె లున్నవి ఏల సామీ!'
'జుంటితేనెలు జోపు
చుండ ఒత్తెను కొమ్మ భామా!'

'మోవిపై పలుగుర్తు
లేవో కనంబడు నవేలా?'
'పొదరిల్లు కదల తు
మ్మెద పెదవి కరచినది బేలా!'

'ఇంతసేపాయె నీ
వెందేగినావురా సామీ!'
'ఇదిగో నీకై పండ్ల
నేరితెచ్చితిని నా భామా!'

పడతి కింతింత కోపము జారిపోయె
పగడమ్ము నునుముత్యముగ మారిపోయె.

రింగుమని అందె మ్రోగంగ ముందు దూకె
అతని మెయి పందిరికి లతవోలె ప్రాకె.

ఇంతకాలము ప్రపంచాంతరమ్మున నున్న
నృపతి పులకించె తానే సింగడైనట్లు.

లక్ష్మీనృసింహు లోకరై నృత్యమాడి రా
లక్ష్మీ నృసింహు ముందు
లకుమ ఒక్కతిగ స్వామికి రాయనికి మ్రొక్కె
లాస్యావసానమందు.



నాట్యానంతరము రాజ
నర్తకియును రాజేంద్రుడు
శ్రీమహోదబలనృహరి
స్వామికి నతులిడ నిలిచిరి.

పుండరీకపత్ర జైత్ర
ములు స్వామి ప్రసన్ననేత్ర
ములలో అమృతంపునవ్వు
మొలకలు చూచెను రాయడు.

సంధ్యాశోణములు హరి
స్వామినయనకోణములం
దున హిరణ్యకశిపుని నె
త్తురుచారలు చూచె లకుమ.

ఇద్దరొరసికొని నిల్చిరి
ఇద్దరు వేరుగ చూచిరి
తనువు లేకమైనంతనె
మనసు లేకమవునా మరి?

చామరముల బోలు శిరో
జశ్రేణుల వెల్గిపోవు
గరుడాచలనిలయము గని
గగుర్పొడిచె రేనిమేను.

కేసరములు పటపట ఊ
గించుచు గర్జించు క్రుద్ధ
కంఠీరవమూర్తి చూచి
కంపితయైపోయె లకుమ.

లకుమ పొందు కంపమ్మును
రాయడు గమనించసాగె
నో లేదో వశముతప్పి
ఒరిగె నామె రేనిపైన.

రాయలపరివార మపుడు
ఆఁ యని విస్మయమునందె.
రాయల భుజపీఠిపైన
ఆయమ విశ్రాంతినందె.

మసృణమైన రాయల భుజ
మండలమ్ముపైన మొగలి
ముండ్లవంటి పులకాంకుర
ములు సముద్గతములయ్యెను.

లకుమా లవలీదళ గ
ల్లస్పర్శన తన్మయుడగు
రాయలు కనులపుడు మూసికొనెను.



రాజభుజా రోమాంచా
గ్ర స్పృశా ప్రబుద్ధయౌచు
లకుమ కనులు విప్పి చూచికొనెను.

తాను రాజుబాహువె ఉప
ధానముగా చేసికొనియె
నని తెలిసి అదరిపడి రా
యని పదముల వ్రాలె నామె.

ముకుళితాక్షుడైన రాజు
చకితుండై కనులు విప్పి
లేవనెత్తె నిజచరణ వి
లీనవదనయౌ లకుమను.

రాజును లకుమయు గుండెలు
రాచికొనగ చూచికొనిరి.
ఆ చూపులు విడిపోవుట
కై మోములు దించుకొనిరి.

శ్రీమదహోబలాస్థాని
శ్రీజాని తదవసరమున
నిజవక్షమ్మున చూపులు
నిలుపుకొన్నయట్లు తోచె.

ప్రభువును లకుమయు తత్పరి
వారమ్మును సింహాద్రికి
కడసారిగ ఏటికోళ్ళ
నిడి పయనము సాగించిరి.

సాగిసాగి కుమారగిరి భూ
జాని చేరెను దక్షవాటిక.
భీమనాథేశ్వర శిరస్తర
ళామృతాంశు నవాంశుపేటిక.

దక్షపుర ఘంటాధ్వమున అర
దమ్ముపై చను రేని జూచిరి
వాటిలోపలి నాటి అచ్చర
బోటులను బోలిన వధూటులు.

రాజువెన్క రథమ్ముపై చను
లకుమ గని సుందరులు కొందరు
గుసగుసలువోయిరి పురూరవు
గూడిపోయిన ఊర్వశియెయని.

దక్షనగరి మృగాక్షులకు ఈ
దృక్షముగ కనువిందుసేయుచు
ఇరువురేగిరి అపుడు గోదా
వరికి అవగాహార్థమై.



త్ర్యంబకాచలశిఖర జాతయు
తరళమధుర పయఃపునీతయు
పుడమికెల్లను పేరటాలగు
పుణ్యగోదావరి కనంబడె.

పొంగిపోయెను రేడు దక్షిణ
గంగనుంగని నాడు నింగిని
దిగిన మందాకినిని గాంచిన
సగరు మునిమనుమని విధమ్మున.

రాయనికి అలనాటి సీతా
రామచంద్రుల వలపుతీవెల
వాంఛలూరగపెంచు గోదా
వరిజలమ్ములు స్మృతికివచ్చెను.

రాళ్ళరప్పల నడచి కందిన
రామచంద్రుని చరణములకై
శబరి తెచ్చిన పుణ్యగోదా
సలిలములు స్ఫురియించె లకుమకు.

వారలంతట చూపుమేరల
దూరమున తానమ్ములాడిరి.
ఇరువురిని జలధార మాత్రము
ఏకసూత్రములో బిగించెను.

సిక్తచేల పరిస్ఫుటాంగ వ
శీకృత ప్రభుచిత్తయై ని
ల్చినది లకుమ జలమ్ము మెలుపల
చెలువరూపును గొనిన అలవలె.

లకుమ విస్ఫురితాంగ సౌంద
ర్యప్రమత్తుడు రాయ డామెను
కౌగిలించ గమించగా సై
కతము లాతని నడ్డగించెను.

కెరటముం బలె రాయ డీగతి
క్రిందుమీదై పోవుచుండగ
విన్పడెను భీమేశ్వరాలయ
విశదశంఖ మహాస్వరమ్ములు.

రాయడును లకుమయును ఎప్పటి
చాయ మౌనముగా గమించిరి.
శంఖనాదము విన్నపిమ్మట
శరత్కాసారముల మించిరి.

విమలభూతి త్రిపుం
డ్రములు నొసలారగా బెట్టి
పొల్పన్నె జిలుగు దో
వతిని చుంగులువోసి కట్టి;



పరమమాహేశ్వరుడు
ప్రభువు నడచెను దక్షవాటి.
అతని వెంటనె లకుమ
అనుగమించుటయె పరిపాటి.

దక్షవాటికి చతుర్ద్వారమ్ము లందున్న
దైవతమ్ముల కొలిచె ప్రభువు.

కాలభైరవ ఢుంఠిగణపతి స్కందులకు
కైమోడ్పులను చేసె ప్రభువు.

అంత భీమేశ్వరమహాలయ ప్రాంగణము
నందు నిల్చెను ప్రభువు ఆనందమూర్తియై.

దక్షవాటీ తీర్థధాము డగు భీమనా
యకు డతని ప్రత్యణువునందు ప్రణవము నూదె.

ధరణీశ్వరుం డపుడు తాదాత్మ్యమును పొంది
పాడెను మహానటుని భవ్యసంకీర్తనలు.

"ఓ ప్రభూ! ఓ స్వయంభూ!
ఓంకారవేద్య శంభూ!

నీవున్న యీ దక్షవాటి
నిగమాంత మణితులాకోటి.

నీవున్న యీ దక్షవాటి
నిఖిలదైవత తీర్థకోటి.

కైలాసమునకు చొక్కంపు ప్రతిబింబ మిది
దక్షిణమ్మున సముద్గతమైన కాశి యిది.

ఆదిసతి యోగానలార్చిః పునీతమిది
సామిధేనీమంత్రసంగీత పూతమిది.

ఆంధ్రదేశాంభోజమందు కర్ణిక యిద్ది
ద్వాదశక్షేత్రములు దాని రేకులు సుమీ.

సప్తగోదావరీ జలధార మధుధార
భీమేశ! చెప్పనేలా మరాళము నీవు.

నీపార్శ్వమున నిల్చె నిఖిలశక్తిగణమ్ము
లందు ప్రోజ్జ్వలమూర్తియౌ మాణికాదేవి.

కాలభైరవహసిత కహకహనినాదముల్
వీరభద్రుని తాండవోరుగుల్ఫధ్వనుల్
నీ నిత్యసంగీతముల్
నీ శ్రవణసంప్రీతముల్.



అలనాడు సానికూతులవెంట చరియించి
నేడు జ్యోతిర్లింగ నిగమాకృతి ధరించి
మమ్ము ముగ్ధుల జేసినావు
మమ్ము ముక్తుల జేసినావు."

ఇటుల తన్మయుడై మహేశ్వరుని వినుతించి
పంచాక్షరీమంత్ర పఠనమ్ము గావించి
శాస్త్రోక్తరీతి పూజావిధులు జరిపించి
తదుపరి తులాపురుషదానాదు లొనరించి

తృప్తుడయ్యెను భూనియంత
తృప్త యయ్యెను లకుమయంత.

నాటి సంధ్యావేళ శివునికి
నాట్య నైవేద్యమ్ము నిడుమని
ఆనతిచ్చెను ప్రభువు లకుమకు
అర్ధమీలిత లోచనుండై.

గజ్జె కదలించినది లకుమ జ
గజ్జనని వేషమ్ము దాలిచి
తనదు తాండవనృత్య సమయము
తానె మరచి శివుండు చూడగ.

తరళమధ్యముతో భుజంగ
త్రాసనృత్తము నామె చూపెను.
భీమనాథేశ్వరుని మెడలో
పాము మెల్లగ పడగనూపెను.

అభినయించెను లకుమ అఖిలా
జాండభాండము లవిసిపోవగ
చండతపమొనరించు దహనే
క్షణుని నాసాగ్రస్థదృష్టిని.

అభినయించెను లకుమ; భువిపై
అవతరిలు శంపాలతికయన
కదలి శంభుని అడుగుదమ్ముల
నొదిగి నిల్చిన హైమవతిగా.

మెత్తమెత్తగ మలయసాను స
మీరమాలలు వీచెను.
మెల్లమెల్లగ గిరిజ ఉగ్రుని
కాళ్ళపై విరులుంచెను.

భవుడు కన్నులువిప్పి చూచెను.
ప్రణయదేవత యెదుట తోచెను.
మంచితరుణమ్మంచు మదనుడు
పంచబాణమ్ములను వేసెను.



పార్వతీ ముఖచంద్రబింబము
పైన ఈశుడు చూపునాటెను.
పండువెన్నెలలోన పొంగెడు
పాల్కడలివలె పైకి లేచెను.

అగ్గినుమిసెడు శివుని నిటల మ
హాంబకము అమృతీభవించెను.
అతనికౌగిట పార్వతీ పుల
కిత తనూలత కానుపించెను.

అంతట చిత్రమ్ముగ 'లకు
మా' యని పిల్చుచు ఆమెను
కర్పూరవసంత నృపుడు
గాటముగా కౌగిలించె.

రసభంగము చేసెడు నీ
రసహృదయుడు కాడు రేడు.
ఔచిత్యజ్ఞుండైనను
ఆవేశవశుండు రేడు.

వెన్నవంటి హృదయతంత్రు
లున్న వసంతనృపాలుడు
తనగొంతున గాద్గద్యము
తరగెత్తగ ఇట్టులనెను.

'లకుమా! ముందటిదృశ్య
మ్మిక చూడగలేను.
భర్గుని చిచ్చరకంటిని
భరియించగలేను.

పూలవింటిదొర నిలువున
కాలిపోవ నెట్లు సైతు.
శివగిరిజల బిగికౌగిలి
చెదరిపోవ నెట్లు చూతు.

భవుని కవుగిటన్ పార్వతి
పార్వతి కవుగిటన్ భవుడు
నా కౌగిట నీవువోలె
నీ కౌగిట నేనువోలె.

'ఏమంటిని? ఏమంటిని?'
ఇటుచూచెను తత్తరపడి.
'ఏమైతిని? ఏమైతిని?'
ఎటొచూచెను బిత్తరపడి.

రాయల పరిజనములు ని
ర్వాతవృక్ష పత్రములటు
ఏమియుతోచక తమ రా
జేంద్రుని చూడగసాగిరి.



లకుమలోన సమస్తసా
త్త్వికభావము లుద్గమించె.
ఆయమ తన్మయయై రా
యని బిగిగా కౌగిలించె.

'నా దేవర! నా గుండియ
పాదున రతనాలమొల్క!
నా మనసే పంజరమ్ము
గా మెలగిన రామచిల్క!'

గొంతు తొట్రుపడగ పల్కి
కొసరికొసరి యేడ్చె నామె.
ఆమె అశ్రుధారలలో
హాసమెంతొ? త్రాసమెంతొ?

లకుమ అపుడె తొలిసారిగ
రాయని తన మనసారగ కౌగిలించె.
అచట కొండవీట రాణి
అతివికృతస్వప్నమున కలవరించె.

ఇచట రేడు లకుమను తన
హృదయపట్టమహిషిగా ప్రతిష్ఠించెను.
అచట రాణి కలలో శ
య్యపై పొరలిపొరలి నేలపై దొరలెను.

రాజు మరలా 'లకుమా'యని
ప్రాణపంచకము నదించగా పిలిచెను.
రాణి అచట మేలుకాంచి
'ప్రభూ' యంచు బిక్కుబిక్కుమని యేడ్చెను.

తలపై గంగను దేహా
ర్థమున పార్వతిని నిల్పిన
సర్వజ్ఞుడు అమాయకుని
సరణి దిక్కులను చూచెను.

ఆలయశంఖారావ
ప్రారంభసమాప్తులతో
విశ్వము ద్వంద్వాత్మకమను
విశదసత్యము ధ్వనించెను.

దిక్కటళన జృంభిత రా
త్రీవక్త్ర స్ఫురదంష్ట్రి
కలు నిరాశలో ఆశా
కాంతు లున్నవని చెప్పెను.

********

# చతుర్థాశ్వాసం

సాగినది రాజరథము
మ్రోగె కాంతారపథము.

మదవలాహకగర్జ మాద్రిగా చక్రనే
మిధ్వనుల్ వినిపించగా
మినుమన్ను కంపించగా
సాగినది రాజరథము
మ్రోగె కాంతారపథము.

దంభోళిపతన సాధ్వసవిస్ఫురణతోడ
తరులు చెచ్చెర పర్విడన్
గిరులు దిర్దిర తిరుగగన్.
సాగినది రాజరథము
మ్రోగె కాంతారపథము.

కల్లోలినుల పిల్లకాల్వలట్టుల దాటి
చటులాటవులను ముంగిటితోటలుగ దాటి
జలదచుంబి గిరీంద్రములను ఉద్యానస్థ

కృతకభూమీధర ప్రతిమానముగ దాటి
సాగినది రాజరథము
మ్రోగె కాంతారపథము.

కొండకోనలను ఆఖండల రథమ్మాయె
కొండవీట అయారె కుసుమరథమైపోయె.

రాచబాటను నిల్చు ప్రజ లబ్రపడ తేరి
పై రతీమన్మథుల ప్రతిరూపములు తోచె.

"రాణి అధివసియించు రేనిపార్శ్వమున న
ర్తకి కూరుచుండుటేమి?"
"జనసమక్షమున రాజన్యు డొక అన్యకాం
తను ప్రక్కనుంచుటేమి?"

ప్రజ లీవిధాన గుజగుజపోయిరి
తలకొక్క రీతి వ్యాఖ్యలు చేసిరి.

రథము నిలిచినదంత
రాజసౌధాంగణమునందు.
జయనినాదము లాక
సమునంటె అన్నిటికిముందు.



కాటవేముడు 'మహీ
కాంతునికి స్వాగత'మ్మనెను
బాహాద్వయ మ్మెత్తి
బావను కవుగిలించుకొనెను.

ఆనంద పరిపుల్ల
మతని నేత్రాంభోజయుగము
లకుమ కన్పడగనే
ముకుళితమ్మైపోయె సగము.

రాణి నిల్చినది హ
ర్మ్య గవాక్ష మాలంబనముగ
లకుమ నడిచినది రే
నికి ప్రక్కగా ఒయారముగ.

సుడిగాలి చరచినటు
జడిసిపోయెను మహారాజ్ఞి
వడదెబ్బ తాకినటు
వడకిపోయెను మహారాజ్ఞి.

ఆమె నేత్రములందు
అమవసలు జడలు విరబోసుకొనె
ఆమె హృదయాంగణము
నందు శూన్యము చోటుచేసుకొనె.

మరునాడు కుమారగిరి
క్ష్మానాథుడు కేళీమం
దిరరచనా కుతుహలాం
కురిత మనస్కుడయ్యె.

మరునాడే కాటయ వే
మప్రధాని దైనందిన
పరిజృంభిత పరిపంథి నృ
పాలజిగీషుం డయ్యెను.

వర్ధమాన విజిగీషా
త్వరితాంతఃకరణుడు వే
మప్రధాని రాయనితో
ఈ ప్రకారముగ పల్కెను.

"విజయనగర మెపుడు కొండ
వీటి ప్రక్కలో బల్లెము;
దానికి సైదోడుగ సు
ల్తాను బహమనీరాజ్యము.

రెండవ హరిహరరాయుడు
రెడ్డిరాజ్య కబళనమున
కై దినాలు లెక్క పెట్టు
నని చారులవలన వింటి.



మొదటిదెబ్బ విజయనగర
మున తీసితిమా ఫిరోజు
షా వెంటనే తోకముడిచి
సామంతుండగును మనకు.

పెక్కుదినములయ్యెను త్రు
ప్పెక్కె నా భుజాదండము.
ఉక్కుగొలుసులందు నిల్వ
కున్నది నా వేదండము.

ఇన్నాళ్లుగ ఎటులొ నిగ్ర
హించితి సమరోత్సాహము.
ఇక సెలవిండో ప్రభు! పూ
రింతు జైత్రశంఖమ్మును."

కంఠీరవమటుల నిలిచి
గర్జించిన వేముని వా
క్కులు భూకాంతుని మానస
కుహరమున ప్రతిధ్వనించె.

రాయని గుండియమాటున
తీయని నిదుర మునింగిన
పౌరుషబడబాగ్ని ఒక్క
మారు విజృంభించ పలికె.

"చాంగురె బావా! నీ ఉరు
శౌర్యమునకు జోహారులు;
మాయురె! నీ విజిగీషా
మతికి ధన్యవాదమ్ములు.

జాప్యమేల? యీనాడే
సమరభేరి మ్రోగింపుము
అవశ్యముగ నేను గూడ-"
అనబోవుచు ఆగె రేడు.

ఝుటితిగ ఏదో దృశ్యము
జ్ఞాపకమ్మునకు వచ్చెను
రేనిమోములోని శౌర్య
రేఖ మాసిపోజొచ్చెను.

లకుమ కాలిగజ్జెలు ము
క్త కంఠమ్ముతో పిలిచెను
రేనిలోని పౌరుషాగ్ని
జానువెన్నెలై నిలిచెను.

విద్వన్మణియైన కాట
వేముడు రాయని హృదయ
మ్మున మొలిచిన ఇంద్రచాప
మును వెంటనె గమనించెను.



ఘంటాపథవాదిత సం
గ్రామ భేరికాధ్వని విని
గమనించెను భూపాలుడు
కాటవేము నిష్క్రమణము.

కాలాంబుధిలో రేలుపవళ్ళును
కలలై అలలై సాగినవి.
భూరమణుని కేళీగృహకాంతులు
తారలదారుల మూగినవి.

వనితల మెయివన్నెనుగని నవ్వెడి
బంగరుతలుపులు వెలసినవి.
నెలతల ముఖమండలముల కేరెడు
నెలరాతిన్నెలు మెరసినవి.

పడతులమోవుల పరిహసియించెడు
పగడపుచూరులు పొలిచినవి.
ముదితలనవ్వుల చులకనచేసెడు
ముత్యపువాకిళు లమరినవి.

సన్ననివెన్నెల జాలుల తేలెడు
చంద్రశాల లొప్పారినవి.
రేయింబవళ్లు కేళులకోసము
క్రీడాసరసులు మీరినవి.

రాయని కేళీరమ్యహర్మ్యమీ
చాయ చకచ్చకలీనుచు నిలిచెను.
అందున లకుమాసుందరి అందెల
మందామందస్వరములు పొలిచెను.

కేళీమందిరపార్శ్వమున తుల
కించెను 'గ్రహరాజసౌధము.'
పాలకడలి గారాలకూతురు మ
హాలక్ష్మికి అది నివాసము.

రాయడొకమా రిందిరాపదాంభోజ భృం
గాయమానుం డగుచునుండు.
మరియొక్కమారు లకుమా వదనచంద్రబిం
బ చకోరమై సాగుచుండు.

భక్తియును రక్తియును ప్రభువుజీవితమందు
పర్యాయపదము లైపోయె.
క్రమముగా రేని జీవమహాప్రబంధమున
రక్తిమాత్రము నిల్చిపోయె.

తొలుత లకుమా కింకి
ణులకు రాయండు ముగ్ధుండయ్యె
ఆ వెనుక ఆమె తను
లావణ్యమునకె దాసుండయ్యె.



లకుమయే రాణిమౌళి
బ్రతుకునావను నడుపు చుక్కాని
లకుమయే అతని లీ
లామహాసామ్రాజ్యమున రాణి.

ఆయమ వసంతరా
యల మానససరోవ
రాంతరాళవిహారయైన రాజమరాళి.

ఆయమ వసంతరా
యల జీవనాడులకు
స్పందనముకలిగించు చైతన్యరసకేళి.

ఆమెకన్నులు విరిసి
నంతసే పతడు పగలనుకొనును.

ఆమె కన్నులు మోడ్చి
నపుడె రాతిరి యయ్యెననుకొనును.

పృథ్వి నాయమ జఘనపీఠమ్మునం జూచి
జల మామె కంటిపాపలలోతులం జూచి
తేజమ్మ నామె ముఖరాజీవమున గాంచి
వాయుగతి నామె నిశ్వాసముల గుర్తించి

ఆకాశ మామె మధ్యమునందు గమనించి
నిఖిలసృష్టికి లకుమనే ప్రతీకగ నెంచి

ఆమె సర్వాంగముల నైక్యమయ్యెను రాజు
ఆమె యెదపాన్పుపై అధివసించెను రాజు.

ఆమె ముఖముకురమ్ము
నందు తన మోము సరిచూచుకొను.
ఆమె కనుపాపలం
దలవోకగా కురులు దిద్దుకొను.

ఆమె అధరోష్ఠమ్ము
నందు తన రాగమ్ము చూచుకొను.
ఆమె కురులం దిరులు
అణగియుండుట చూచి మెచ్చుకొను.

రాయనికి లకుమ నిద్రాస్థితియె ప్రళయమ్ము.
ఆమె నయనోన్మేష మాతనికి ఉదయమ్ము.

లకుమయే గానమ్ము లకుమయే ప్రాణమ్ము
లకుమయే నాదబిందుకళానిధానమ్ము.



లకుమకు తోచెను రాయడు
ప్రకృతికి పురుషుని పోలిక
వారిరువురి సాంగత్యము
వాగర్థమ్ముల కేలిక.

లకుమ ఒకప్పుడు నదిపో
లిక పొంగులువోయినపుడు
ప్రభువే రత్నాకరుడై
పరీరంభమున ముంచును.

ఆమె విపంచికయై తా
దాత్మ్యమ్మున మ్రోయునపుడు
ప్రభువు వాయమ తనూవల్లి
పై పాణితలమ్ముంచును.

ఆమె ప్రభువు నొక్కొకమా
రాశ్వాసించును పర్వత
సార్వభౌము చుంచు దువ్వు
సారతరంగిణి విధాన.

తనవైపే అహర్నిశలు
అనిమిషుడై చూచు రాజు
నామె నిదురపుచ్చును నా
రాయణుని రమాసతివలె.

ఇరువురు జలకేళిదేలు
తరుణమ్మున నీటమునిగి
పైకిలేచు నామె రేని
పదములు తలబంతులుగా.

ఇరువు రీదులాడినపుడు
ఎపుడొ రేడు నీటమునిగి
గభాలునన్ లేచు నామె
కడ చక్కిలిగింతలుగా.

ఇరువురు చదరంగమాడు
దురు ఎంతో కష్టబూని
ఎవరోడిన చివరికి బిగి
కవుగిలింత శిక్షయౌను.

ఇరువురు చిత్తరువులు వ్రా
తురు; ఏ రూపములైనను
రచన పూర్తి యైనంతనె
లకుమా ప్రభువుల బోలును.

ప్రతిసంధ్యా మధురవేళ
లకుమ గజ్జెకదలించును
ప్రభువు శరీరము నాద
బ్రహ్మమ్మై తులకించును.



అభినయ దుగ్ధాంభోనిధి
యందలి మీగడలబోలు
రసవన్నవలాస్యభంగు
లను లకుమ ప్రదర్శించును.

భరతమునీంద్రగ్రంథ
ప్రసవమంజరీ ఘుమఘుమ
లెదలో జీర్ణించుకొన్న
నృపతి వీణ సారించును.

ఆమె బొమలు కదలించును
అతడటులే చూచుచుండు.
ఆమె గ్రీవమును ద్రిప్పును
అత డోహాయనుచునుండు.

ఆమె వివిధహస్తముద్ర లభినయించు
అతడమృతము దొరికినటుల మురిసిపోవు
సాత్త్వికభావమ్ము లామె సవదరించు
సరసుడు రాయడు పై పై కెగిసిపోవు.

భరతుడు చూపించనట్టి
భావమ్ములు చూపె లకుమ
భరతుడు రచియించనట్టి
భంగులు రచియించె రాజు.

ఆమె కాలు మోపగనే
అదియె నాట్యమైనట్టుల
అతడు గంటమాడించిన
అదియె శాస్త్రమైపోయెను.

తొల్కరిజల్లునకు బీళ్లు
పుల్కరించిపోవు లీల
లకుమాసంగతి నుబికెను
రాయని వైదుష్యధార.

లకుమ నాట్యమున రంభాదుల మించెను.
ప్రభువు గ్రంథరచన పూర్తికావించెను.
లకుమ ఆడియాడి రేని మ్రోల వ్రాలె
లకుమ ప్రభునిపరీరంభణమున దేలె.

ఆమె కరాంభోజాతము
లందు రాయ దర్పించెను
అభినయశాస్త్ర శిరోమణి
నాత్మకృత గ్రంథమ్మును.

రాయని బంగరుగంటపు
రాయిడిచే రవణిల్లెడు
గ్రంథరత్నమును వెంటనె
కనులకద్దుకొనెను లకుమ.



లకుమ చెక్కిళుల నిమురుచు
ప్రభువిట్లనె "ఓ లకుమా!
నీ వూదిన ఊపిరియే
ఈ 'వసంతరాజీయము'.

జైత్రయాత్రలందు ఏమి
సాధించెడివాడ నేను
ఒక భూపతి నెత్రుపంటయో?
ఒక సతి కన్నీటిమంటయో?

నీ సంగతి నా సుషుప్త
వాసన లుద్బుద్ధమయ్యె
గాలితాకిడికి వీణియ
గలగలలాడిన కైవడి.

మట్టిముద్దనొక అనర్ఘ
మణిగా మలచితి వీవే
రాతిని సాలగ్రామము
గా తీరిచినా వీవే."

రాయడిటుల మేనుమరచి
లకుమను మిన్నులకెత్తగ
ఆయమ సిగ్గుతో క్రుంగి
పోయి మందముగ నిట్లనె.

'ప్రభూ! చరణదాసి నిటుల
ప్రశంసించ తగునా?
కాలిధూళి యేనాటికి
గంధపుపొడి యగునా?

నీవొక నాగస్వరమవు
నేనో నాగిని మాత్రము
ఇరువుర బంధించివేసె
నేదో అంతస్సూత్రము.

నీవు నిండుచందురుడవు
నేనో కల్వలచెల్వను
పరిమళ సోపానపంక్తి
ఇరువురి నేకము చేసెను.

నీ పాదపరాగము నా
పాపట సిందూరముగా
కై సేసెడు భాగ్యమున్న
కావలసిన దేమున్నది?'

ఈ రీతిగ వా రుభయులు
పారస్పరికానురాగ
జలధి నోలలాడ దిన
మ్ములు నిమిషము లైపోయెను.



రాయ డొక వేకువను సౌధా
గ్రమున నుండగ కానుపించెను
దూరమందున నేలపై ఒక
ధూళి మేఘము నడచినట్టుల.

అంతకంతకు నడచెనది నగ
రాభిముఖమై; దాని పల్చని
తెరలలో మిరుమిట్లనిడె ను
ద్ధురమహాధ్వజదండశిఖరము.

"జయము జయము కుమారగిరి భూ
జాని" కను సైనికుల ఘోషలు
నిమిషకాలము ధారుణీ గగ
నముల నొక ముడిలో బిగించెను.

స్యందనముపై విరాజిల్లెను
శౌర్యధాముడు కాట వేముడు
నింగిలోపలి సప్తహయుడే
నేలపై దిగినాడనంగా.

తరణికిరణములట్లు నగరిని
తరలినవి చతురంగబలములు
కొండవీటికె దిగ్విజయ మని
ఘోషలిడె కాహళదళమ్ములు.

స్యందనమ్ము నృపాల కేళీ
సౌధముఖమున నిలిచిపోయెను.
క్రొత్తమేడను గాంచి వేముని
గుండె ఈషచ్చలిత మయ్యెను.

రాజు సౌధాట్టాలకమున ద
రస్మితాననుడౌచు నిల్చెను.
కాటవేముం డొకడె రాయని
కడకు వెడలగ రథము డిగ్గెను.

'స్వాగతము వీరావతారున'
కంచు ఎదురేగెను నరేంద్రుడు.
ప్రభుని గాఢాలింగనమ్మున
పరవశుండైపోయె వేముడు.

కాటవేముడు నూత్నసౌధము
కలయజూచుట గుర్తుపట్టిన
రాయ డాతని నడిగె 'హరిహర
రాయలకు కుశలమా? బావా?'

సమరయాత్రను గూర్చి తెలుపక
సౌధపరిశీలనము చేయుట
తెలిసికొని రవ్వంత సిగ్గిలి
పలికె నీగతి కాటవేముడు.



'విజయనగరీ సైన్యసంపద
విలయగర్భములోన కలిసెను
కాని బావా! నాదు మామయ
గారి సేమము కేమి లోపము?'

విస్మితుండౌ రాయడంతట
సస్మితుండై అడిగె 'బావా!
విజయలక్ష్మికి తోడుగా ప్రా
ప్తించెనా గృహలక్ష్మి సైతము?'

కోరమీసల కొసల మెరిసిన
దోరనవ్వును దాచి వేముడు
పలికె నిట్టుల 'శబ్దవిదులకు
తెలియలేనిది యేది? బావా'

నెలలతరబడి జరిగినట్టి అ
నిన్ జితుండై హరిహరుడు నన్
శరణు వేడి అనుంగుపుత్రిని
హరిహరాంబను కాన్కవెట్టెను.

శరణు చొచ్చిన శత్రు వగుటను
హరిహరుని ప్రాణములు కాచితి.
క్షాత్రశుల్కం బగుట ఆతని
పుత్రికను నే స్వీకరించితి;

కాటవేముని సముచిత వచ
స్కతకు సమ్మదమంది రాయం
డనెను 'బావా! అడుగమరచితి
వా మదీయ విజయపరంపర.

నీవు విస్మయమంది చూచిన
ఈ విశాల విలాస హర్మ్యము
నెందు తాకిన లకుమ బంగరు
టందియల ఘల్లులలు విన్పడు.

ఇదేనా ఘనకార్యమని భా
వింతువేమో! ఇన్నినాళ్ళ త
పమ్ము పల్కినదోయి నా జ
న్మమ్ము పండినదోయి బావా!'

అనుచు ఆనందాతిరేక
మ్మున సమస్తము మరచి 'లకుమా'
యనుచు పిలిచెను లకుమ నిలిచెను.
అబ్రపడి వేముండు చూచెను.

ప్రభుని యింగితమును గ్రహించిన
లకుమ తెచ్చెను గ్రంథరాజము.
దాని పుటలను విప్ప వేముని
లోన విరిసె నపూర్వతేజము.



అతనిలోని కళాత్మ వర్షా
ఋతునదింబలె పొంగిపోయెను.
రేనిపై గల కినుక బుడగ వి
ధాన వెంటనె మాయమయ్యెను.

'ఇన్నినాళ్లు మనస్సులో వే
ర్దన్ని ప్రౌఢత్వమ్ము నందిన
మీ కళాభిజ్ఞత బహిర్ముఖ
మై కనంబడె నేడు బావా!

కాళిదాసుని నాటక వ్యా
ఖ్యారచన ముగియించి మీ చర
ణాంబుజమ్ముల నుంచి ధన్యుడ
నౌదు నో విద్వన్మణీ!'

ప్రభువు కాటయవేము రసికా
గ్రతకు మోదాశ్రువులు రాల్చెను.
లకుమ కాటయవేము సహృదయ
తకు మనస్సున కేలుమోడ్చెను.

ఇచట సర్వులు హర్షపులక
ప్రచయనిచిత స్వాంతులే.
అచట రాణికి నిత్యము విషా
దాశ్రుమయమౌ గడియలే.

వాసరమ్ములు గడచిపోయెను
మాసములు గమియించిపోయెను.
రాణివేదన గుండెలో పెను
రాచపుండుగ మారిపోయెను.

రాయడు వేశ్యాలోలుండని
రాజ్యములో గుసగుస హెచ్చెను
రాయడు లకుమాదాసుండని
రచ్చలపై చర్చలు రెచ్చెను.

ప్రభునికి లకుమేతరములు దు
ర్భరము లనెడు వదంతి లేచెను.
ప్రభువు రాజ్యపరాఙ్ముఖుం డని
పరరాజుల గుండెలు పూచెను.

కటకేశుడు కత్తులు నూరెను
గర్జించెను ఫిరోజుషాహా.
మండలనాథుల దృప్తభుజా
మండల కండూతులు ముదిరెను.

అంతఃకల్లోలము లుబికెను
అణగార్చెను కాటయవేముడు.
మహారాజ్ఞి మంచముపట్టెను
మనోవ్యాధి మానుపు నెవ్వడు?



అగ్నిపర్వత మట్టు లఖిలరాజ్య మ్ముడికె
రాజు కేళీమందిరము వెన్నెలలు చిలికె.

రాణి వ్యాధిగ్రస్త యైనదను దుర్వార్త
కాటవేమునిపాలి కర్ణశల్య మ్మయ్యె.

ఆమె నాశ్వాసించ నరిగె నొకనా డతడు.
తనకు నయమైనదని తప్పుకొన్నది రాణి.

గోహృదయమును పెంచుకొన్న రాణిని గాంచి
కనులలో నీరు గ్రిరున తిరిగె వేమునికి.

తన ఉనికి ఆమె గుండెను చెరువు చేయునని
గమనించి వేముండు గడచె తన్మందిరము.

సూటిగా నాతడు వసుంధరాధీశ్వరుని
కేళికాహర్మ్యమున కేగె చీకాకుపడి.

కడలిపొంగటుల ఉద్గమియించు ఆవేశ
మణగార్చుకొని యిట్టులనె రేనితో నతడు.

"మీకు చెప్పదగిన శక్తి
నాకు లేదు మహాప్రభూ!
అయిన ఒకటి రెండు మాట
లన సాహస మొనరించితి.

కడచిన నెలలోన వింత
గా జనసందోహమ్మున
ఏదియో అశాంతి వీచె
ఈదరగాలి విధమ్మున.

మీరు రాజ్యమున కించుక
దూరముగా నున్నందున
మిట్టిపడిరయా జీవ
న్మృతులౌ శాత్రవనృపతులు.

మానలేని ఒక వేదన
చే నిపీడ్యమానయగుచు
మహారాజ్ఞి యేమి చెప్ప
మంచముపట్టెను బావా!

మీ మంగళదర్శనమున
కై మంత్రులు మున్నగు ఆ
స్థానీయులు వేచిరి చం
ద్ర చకోర న్యాయముగా.

నే నెన్నివిధాల సమా
ధానపరచుటకు జూచిన
అర్భకుడు వరాలివ్వగ
యత్నించినయట్టులయ్యె.



మీ రొకపరి ఆస్థానము
చేరవచ్చి కూర్చుండుడు.
తదుపరి భారము నా స్కం
ధాగ్రమ్ములపై నిల్పుడు."

హేతుగర్భితమ్మలైన
ఆతని వాక్కులబరువున
కవనీపతి 'ఔ' నని తల
నాడించక తప్పలేదు.

క్రొత్త దుర్గ మవలీలగ
కొల్లగొట్టినట్టుల ఉ
ప్పొంగుచు కాటయవేముడు
భూమీపతి సెలవుగొనెను.

బంగరు సంకెలలో తన
పాణియుగ్మ మిరికినటుల
ఓటుపడుచు రాయం డా
నాటి నిశీథము నీడ్చెను.

# పంచమాశ్వాసం

మరునాడు కొమరగిరి
ధరణీశ్వరుం డలంకృతుడయ్యె
బహుకాలమైన త
ర్వాత సంభృతకిరీటుండయ్యె.

లకుమ ఆతని నిటా
లమ్ముపై తిలకమ్ము సవరించె.
లకుమ కపురంపు టా
రతి పట్టి పన్నీరు చిలికించె.

లకుమ ప్రక్కకు లేని
దొక నిమేషమ్ము నిల్వడు రేడు.
ఆమె నున్నని భుజము
నందుండి చేయి తీయగలేడు.

ఇక పోదునని ముందు
నకు బరువుగా పదమ్మును మోపు.
లకుమా యనుచును వె
న్కకు మెడను ద్రిప్పి ఆమెను చూచు.

కొలువుకూటమ్ము ని
శ్చలసాగరము వోలె నిలిచెనట.
రేని చిత్తమ్ము సుడి
లోని పడవగ మారిపోయె నిట.

రేనికై కొలువు దీ
రినవారి కనులు కాయలుగాసె.
పాతాళమున జారి
పడిపోయినటు వేమునికి తోచె.

ఇంతలో అందరి ము
ఖేందుబింబాళి రా
హువిముక్త మైనట్టు లోజస్కమయ్యె.

ద్వారముఖమున వసం
తప్రభుని ఆజాను
బాహురోచిర్మూర్తి ప్రత్యక్షమయ్యె.

శ్మశ్రుసుందర వదనచంద్రుండు కనకభూ
భృత్ ధైర్యసాంద్రుండు నృపుడు నడిచెను ముందు.

'జయ కొమరగిరి ధరేశ్వర రూపనారాయ'
ణాది స్తుతులు సభాంతరమందు మార్మ్రోగె.

జననాథమౌళి కూర్చొనెను నానా మణి
స్థగిత సింహాసనముపై.
కమ్మతావుల ప్రసారమ్మిడిరి చామర
గ్రాహిణులు రాజేంద్రుపై.

కలయజూచెను రేడు కొలువు నొక పర్యాయ
మలికమ్ము వికసింపగా
ప్రజలు కుతుకంపడిరి ప్రభుమౌళి ముత్యాల
పలుకు లాకర్షింపగా.

అంతలో రేని కర్ణాంతరమ్ములకు పిడు
గౌ వార్త అందించబడెను.
ఏదియొ ఆక్రందనమ్మిడి ముఖమ్మునుపిండి
నృపతి ఆస్థానమ్ము విడెను.

ఆ వార్త మరు నిమిషమందు కొలువంతటను
దావాగ్నివలె విస్తరించె.
ప్రతి నాల్క తుదపైన లకుమ కాల్బేణకెనను
పలుకులే ప్రక్క దొరలించె.

'ఒక నర్తకికి కాల్బేణకుటేమి
ఏకిమీడు పర్వలెత్తుట యేమి!
ఒక చిన్న ఘటన జరుగుట యేమి
ఒడ్డోలగమ్ము పీడుట యేమి!



సభకిది తిరస్కారము
సభ్యతకు సీత్కారము.'

ఈ గతి ఉపాలంభముల్
హేరాళముగ విన్పడెన్.
వేమప్రధాని అపుడు
ఏమి తోచక మ్రాన్పడెన్.

రాచకొల్వు త్రుటిలో చె
ల్లాచెదరై పోయె.
రాజపుడే కేళీ హ
ర్మ్యమును చేరబోయె.

లకుమ చుట్టు నిల్చిన సే
వికలు ప్రక్కలకు తొలంగ
రాయడు 'ప్రాణసఖీ!' యని
ఆయమ సన్నిధి వ్రాలెను.

తలిరాకుల కన్నను మె
త్తనౌ ఆమె చరణమ్ములు
తన ఒడిలో నిడి సంవా
హనముచేయసాగె రాజు.

'ఇది యేమి ప్రభూ' అని ఆ
సుదతి యెంత వారించిన
వినక ఆమె చరణాబ్జము
లను నిమిరె వసంతేశుడు.

ముత్యాలంతటి బాష్ప
మ్ములతో లకుమా చరణము
లభిషేకించుచు గాద్గ
ద్యముతో నిట్లనె రాయడు.

"ప్రియా ! నీదు కాల్మాత్రమె
బెణకిపోవలేదు సుమా.
నా జీవ నవామృత భాం
డమే తొణకె నోలకుమా.

ఈ పాదములే కాదా
భూపాలుడ నైన నన్ను
అనంత రసరాజ్యమ్మున
కధీశ్వరునిగా జేసెను.

ఈ చరణములే కాదా
రాచవాడనైన నాకు
రెక్క లిచ్చి గంధర్వ వ
రేణ్యునిగా నొసరించెను.



ఈ పదముల రాపాడిన
నూపురములు చిరుగజ్జెలు
చప్పని నా బ్రతుకులో ర
సధ్వనులను పలికించెను.

పువురేకులు తాకినచో
బొబ్బలెత్తు నీ అరి కా
ళ్లను నిమిరితినా పులకిం
చును పంచప్రాణమ్ములు.

మొగలిపూలు నీ జంఘలు
ముదిత! వాని నొక్కనాడు
చూడకున్నచో జగమ్ము
శూన్యమ్మనిపించు నాకు.

భరతుని శాస్త్రమున కొజ్జ
బంతులైన ఈ పదములు
చలియించని నాడు సూర్య
చంద్రుల గతులే తప్పును.

మదిరాక్షుల చూపులలో
మెదలెడు కల్లోలగుణము
నీ కాళుల వ్రేళ్లకొసల
లో కదలాడును సఖియా!

మరల నీవు గజ్జె కట్టి
మరాళరాజమ్ము వోలె
కదలినపుడె నా ప్రాణము
గానము చేయును చెలియా!"

పసిబిడ్డని వోలె ఇటుల
పరిదేవన మొనరించెడు
రాయని గని గుండె పొగిలి
పోయి లకుమ పల్కె నిటుల.

"వెన్నయైన గట్టిపడుట
యున్నది గానీ స్వామీ!
మెత్తదనము దప్ప మీదు
చిత్తము అన్య మెరుంగదు.

నేను పునర్జన్మ మెత్తి
తేని ప్రభూ! రసికతా మ
హాలయమౌ మీ యువహృద
యముగా జన్మింతుగాత.

రేపటి లోపుగనే మణి
నూపురమ్ము సవరింతును
అభినయ కుసుమాంజలితో
ప్రభూ! మిమ్ము పూజింతును."



ఈ విధమగు ఏకాత్మత
తో వా రుభయులు మెలంగ
కాలమ్మది కర్పూరము
గా వెలింగి పరిమళించె.

లకుమకోసము రాజు పేరో
లగమునైన తృణీకరించిన
వార్త రాణియెడందలో విష
వాయువీచికవోలె తాకెను.

అంతవరకే రెక్కతెగిన వి
హంగమట్టుల కుప్పగూలిన
రాణి నీ విషయమ్ము బాణా
గ్రమ్మువలె బాధించసాగెను.

అప్పుడప్పుడు ఆమెలో గో
రంత శశిరేఖిక మిణుక్కను;
ఇప్పు డదియును మాసిపోయెను
ఎప్పటి అమావాస్య మిగిలెను.

ఆమెలోపల కోటివేదన
లారవిడిచిన పక్షములతో
గుడ్లగూబల వోలె నిలిచెను
గుండియను కలగుండు పరచెను.

చిచ్చు లేకయె కాల్చివేసెడు
చింతతో సగమైన రాణిని
చేరవచ్చెను ఆమె నాశ్వా
సించగా ఒకనాడు వేముడు.

రాణిలో జ్వాలాముఖి వలెన్
రగులు వేదన బ్రద్దలయ్యెను.
ఆమె 'అన్నా' యనుచు కాటయ
వేముపైబడి యేడ్వసాగెను.

ఆమె ఆక్రందనము విని కా
టయ్యవేముని గుండె నేలను
చీల్చుకొని ఉప్పొంగి పడి వ
చ్చెను కవోష్ణాశ్రువులధారలు.

అతడు దుఃఖించకుము చెల్లీ
యనుచు ఆశ్వాసించుచుండెను.
ఆమె 'అన్నా' యనుచు ఆతని
అడుగులం బడి యేడ్చుచుండెను.

ఎంతయో యత్నమున ఆయమ
గొంతు విప్పెను; దొంతరలుగా
పొరలిపడు కన్నీటి తరగల
కరగిపోయిన వామె పల్కులు.



కొంత సమయము గడచె నిట్టుల
గొంతు విప్పెను మరల నావిడ;
వాలుటెరుగని ఆమె శోక
జ్వాల శబ్దాకృతి వహించెను.

"ఇన్నినాళ్ళుగ నా యెదను దహి
యించు బాధను దాచియుంచితి.
ఈ దినమ్మున మాత్ర మన్నా
ఏలకో చలియించిపోయితి.

రేడు నా అంతఃపురమునకు
రాడనెడు దుఃఖమ్మ కన్నను
రాచగద్దెను విడిన వార్తయె
రంపమున గోసినది తండ్రీ!

ఆటకత్తెల నాదరించుట
అధిపులకు ధర్మమ్మె కానీ
వారి అడుగుల మ్రోల బ్రతుకుల
ధారవోయుట యేటి న్యాయము?

కేళికామందిరము కన్నను
ఓలగమ్మె పవిత్రమయినది.
వ్యక్తికన్నను దేశసౌభా
గ్యమ్మె ఆదరపాత్రమయినది.

ప్రభువు లలితకళాజగత్ స
మ్రాట్టనుచు నే నెంత మురిసితి
అంతమాత్రమ్మననె దేశ
మ్మతని కొక గవ్వైన కాదా?

కొండవీ డిన్నాళ్లుగా మధు
భాండమట్టుల పెంపు నింపెను.
దానిలోపల నీటి చిను కొక
టైన రాలిన వ్యర్థమే కద!

మనది ఒక సత్ సంప్రదాయము
మన చరిత్రము శ్రవణపేయము
మన కులమ్మన కింతవరకును
మహీసంరక్షణమె ధ్యేయము.

మొన్న రాయలు కొల్వుకూట
మ్మను పరిత్యజియించగా స్వ
ర్గీయుడౌ అనవోతరాణ్మణి
కెంతగా తలవంపులయ్యెనొ?

రెడ్డిరాజ్యస్థాపకుండు అ
రీణశౌర్యరసుండు ప్రోలయ
వేమభూపతి ఆత్మ యెంతగ
బిక్కుబిక్కున పొగిలిపోయెనొ?



ఏమి ప్రేలుచునుంటి నను మ
న్నించు నను మన్నించుమన్నా!
ఎంత అపరాధమ్మొ నా ప్రా
ణేశు నేమో యంటినన్నా !

జనపతికి పాఠాలు నేర్పెడు
సాహసము నా కెపుడు లేదు.
మీకు నీతులు గరపు తలపును
నాకు ఏ కోశమున లేదు."

ఒక మహావేదనయె యీ గతి
ఉద్గమించుట తెలిసికొని కా
టయ్య వేముడు ఎట్టులో ఓ
దార్చగల్గెను మహారాజ్ఞిని.

ధర్మశాస్త్ర జగత్తునకు మణి
దర్పణములౌ ఆమె కరుణో
దాత్త వాక్కుల నెటుల కాదను
విత్తముడు కాటయ్య వేముడు.

కొండంత బరువు తన గుండెపై నిడికొని గ
మించె వేముడు వసుమతీశ్వరుని సన్నిధికి.

అచట రాయడు లకుమ అందించు కర్పూర
వీటికను నోటితో స్వీకరించుచునుండె.

ప్రభునికి నమ స్సమర్పణ చేసి ఆసీను
డౌచు లకుమను లోతుగా చూచె వేముండు.

అతని ముఖగత గభీరతను పరిశీలించి
ఎదొ రహస్య మ్మనుచు ఏగె లోనికి నామె.

ప్రభువునకు అతిసమీపమున కూర్చొని బరువు
గా నిశ్వసించి యాగతి పల్కె వేముండు.

"మరియొక్క మారు ఉన్మాదినై యేమేమొ
అన నెంచినాడ బావా! క్షమించుము నన్ను.

భూదేవి కపరావతారమా రాణి
పొగిలి మంచముపట్టెనో మహీజాని!

ఆ ప్రచండవ్యాధి అలతులను బోదు
ఆమె మనలో నుండునను ఆశ లేదు.

ఆమెలో కోటి వేదనలు చెరలాడె
ఆమె రెక్కలు తెగినయట్లు పొరలాడె.



సుడిలోని ఆకువలె జడిసిపడె నామె
కడసారి మిముజూడ కాంక్షించె నామె.

రాణి వ్యాధిగ్రస్తయైన హేతువు తెలిసి
అట్టుడికి నట్టుడికె నఖిలాంధ్రదేశమ్ము.

కడకు దేశమ్ముకొరకైనను సరే మీరు
అర్ధాంగలక్ష్మి నోదార్పగా పోవలయు.

మరియొక్కమారు ఉన్మాదినై యేమేమొ
అనివేసినాడ బావా! క్షమించుము నన్ను."

కాటవేముని జాలిమాటల వెనుక నున్న
ఈటెలే ప్రభునిలో సూటిగా నాటుకొనె.

ఒకవంక రాణి వేరొకవంక లకుమ తన
స్మృతిపథమ్మున నిల్వ ప్రతిమయయ్యెను రేడు.

రేనిమ్రాన్పాటు గుర్తించి వేముండు తన
తలను నేలకు వాల్చి మెలమెల్లగా చనియె.

కాటవేము నిష్క్రమణము
గనిపెట్టిన లకుమ అంత
విభీతహరిణేక్షణయై
విభుని సన్నిధికి చేరెను.

లకుమ కరాంగుళీస్పర్శ
లతో కొమరగిరిరాయని
స్తబ్ధమైన తనువున చై
తన్యము చిగురించె మరల.

అతడు హఠాత్తుగా రెప్ప
లల్లార్చుచు 'బావా' యనె.
ఎదుటలేడు బావ; లకుమ
యే దీనముగా నిల్చెనె.

నయనగోళముల ఆనం
దచ్ఛటలు పిసాళింపగ
లకుమను బహుగాఢపరీ
రంభణమున ముంచె రేడు.

కడుయత్నముతోడను బిగి
కౌగిలిముడి విప్పి లకుమ
గొంతు రాలుపడగ మహీ
కాంతునితో ఇట్లనియెను.

'వింటిని అస్పష్టముగా
వేమప్రభు వాక్యమ్ములు
నా చేతములోన ప్రభూ!
వీచె మహోత్పాతమ్ములు.



పట్టమహిషి వ్యాధి మహో
పప్లవమ్మునకు సూచిక.
రాణిగారి సేమము దే
శాన కమృతరస వీచిక.

మీ మంగళమూర్తియె రా
జ్ఞీమతల్లి కొక నూతన
జీవనమ్ము నూదును స్వా
మీ! వెడలుడు సత్వరమ్ము.'

లకుమపల్కులకు రాయడు
ఒకయించుక కరగిపోయె.
కాని నిమిషమందె గడ్డ
కట్టినట్టు తోచెనతడు.

ప్రభుని ఊరుపులు లకుమా
పక్ష్మమ్ముల చుంబించగ
ఆమె కనులలో చూపుల
నారవేసి అతడిట్లనె.

'ఎవరెంతగ అన్నను రమ
ణీ! నాచిత్తము మారదు.
నీదు సాహచర్య చికీ
ర్షాదాహము చల్లారదు.

రాణిఅనగ భూదేవికి
ప్రతినిధి; ఆమెపై నాకు
అనురాగ మ్మనను గాని
ఆదరమ్ము గల దెంతో.

రాణిముందు నిల్చుట యన
గా నేలనొ జంకు నాకు.
ఆమెకు దూరముగ నుండు
టదియే సౌఖ్యమ్ము నాకు.

దేశమ్మైనను సరి
యే; శశిబింబ ప్రతిబిం
బమ్మగు నీ ఆననబిం
బమ్ము శరణ్యమ్ము నాకు.

ఒక్కనాడు నిన్నువీడి
ఓలగమ్మునకు వెడలితి.
నాడెంతలు జరిగెనొ జ
న్మాన మరతునా సఖియా!'

భూవరేణ్యు డీగతి వా
పోవుచుండ; లకుమ అతని
కేమియో వచింప నెంచి
ఇంచుక పెదవులు విప్పెను.



రేడు త్రుళ్ళిపడి ఆయమ
రెండుపెదవులను నిజపా
ణితలమ్మున కప్పివేసి
నిడుదఊర్పులను దించెను.

ఆమె రేనిఉరమున శిర
మానించి సుషుప్తినందె.
అత డామెను తనలో ఐ
క్యముచేసి ప్రశాంతినందె.

నాదశక్తి పంచప్రా
ణముల పొదుగుకొన్నయట్లు
రేయి ఉభయులను తనలో
లీనము గావించుకొనెను.

తెల్లవారెను రాణికన్నులు
దివ్విటీలుగ వెల్గుచుండెను.
సంతతస్రవ దశ్రుధారా
చయము చముర్తె జారుచుండెను.

కాటవేముడు మరల వచ్చెను
కనులనిండుగ నీరు తెచ్చెను.
కాటవేముడు తిరిగిపోయెను
కనులు జలజల కురిసిపోయెను.

రాణి మేను తపించె నిప్పున
రగులు పసిడిసలాక పోలిక.
రాణి ఆత్మ వెలింగె నొక ని
ర్వాత దీపజ్యోతి పోలిక;

ఆమె విచ్చుంగనుల రెప్పల
అంచులంబడి జారిపోయెను
పెక్కుగడియలు పెక్కుజాములు
ఒక్క నిండగు పగలు సొంతము.

ఎన్నొ ఊహలు దాడిచేసెను
ఇంతయును చలియించ దాయము
దేశ సౌఖ్యము కొరకు కపురము
తీరుగా జ్వలియించె నాయమ.

తుదకు రేఖామాత్ర మార్గము
తోచగా శోభిల్లె ఆయమ
అడవిలో ఉద్భ్రాంతపథికుని
కడుగుజాడలు తోచినట్టుల.

రాత్రి సగముగ చీలిపోయెను
రాణి ముసుగిడి నిల్చిపోయెను.
అనుగు చెలికత్తెలును లేచిరి
ఆమె అడుగులవెంట నడిచిరి.



ప్రభుని కేళీసౌధరత్న
ప్రాంగణమ్మున రాణి చేరెను.
చెలుల ప్రక్కకు తొలగుమనియెను
తలుపు నల్లన తట్టి పిలిచెను.

అద్దరాతిరి తనను పిలుచుట
కబ్బురంపడి లకుమ లేచెను.
రాయ డాయమ ప్రక్కలో ని
ద్రా పరిష్వంగమున తేలెను.

ఆమె తానే తలుపు తీసెను.
ఆమె 'యెవ'రను ప్రశ్నవేసెను.
రాణి తన నామమ్ము తెలిపెను
లకుమ గుండెలు జల్లుమనియెను.

రాణిమూర్ధము లకుమ చరణా
గ్రములవైపు వినమ్రమయ్యెను.
లకుమ వెంటనే చకితయై మ
స్తకము చేతుల లేవనెత్తెను.

'ఎంతపాపము! మహారాజ్ఞీ
ఏమిచేసితి' వనుచు ఆయమ
రాణి పాదయుగమ్ముపై తల
నూని వలవల యేడ్వసాగెను.

ఆమె లకుమను లేవనెత్తెను
అశ్రువులు పయ్యంట నొత్తెను.
కడకు ప్రాణములైన నిచ్చుట
కై లకుమ అభయ మ్మొసంగెను.

రాణి నాల్గడుగులు గమించెను
లకుమ ఆమెను వెంబడించెను.
రాణి బాష్పనిరుద్ధమయిన స్వ
రమ్ము నీరీతిగ పెకల్చెను.

"నీ పయిన్ ఒక ఘోరభారము
మోపగా వచ్చితిని చెల్లీ
పాల ముంతువొ నీట ముంతువొ
బాధ్యతను గమనించి తల్లీ

నిన్ను రాయలు కన్నులందున
నిలిపినందుకు పరితపించను
కాని దేశమ్మును తృణమ్మటు
కాలద్రోయుట ఎట్లు సైతును?

దేశ మొకదెస నీవు ఒకదెస
తేల్చుకొను మెయ్యది ఘనమ్మో.
వ్యక్తి సంఘములందు ఎయ్యది
ప్రథమగణ్యమొ చెప్పవమ్మా!



గుండె రాయిగ చేసుకొని కడ
కొక్క మాటయె అందునమ్మా!
భూపతిని ఎటులైన విడిపో
వుటయె నీకు అవశ్యమమ్మా!"

రాణి మరియును పల్కబోయెను
కాని కంఠము ఆగిపోయెను.
తన యెడదలో పిడుగుపడు చం
దాన లకుమ చలించిపోయెను.

ఒక్కతియె తా నిల్చిపోయెను
దిక్కులన్నియు బిక్కుమనియెను
గుండె తెగి అస్రములు కన్నుల
కొలకులంబడి దూకిపోయెను.

ఆమె తలుపులు మూసుకొని ప
ర్యంకమందున మేను వాల్చెను.
ఆమె కన్నులు మూసుకొని హృద
యమును మూయగలేక యేడ్చెను.

అంత రాయడు నిదురమత్తున
ఆమె నడుమున కేలు చుట్టెను.
ఆమె పూవుటెడందలో ఒక
అగ్నినగము పెటిల్లుమనియెను.

కత్తి వాదరకన్న ప్రత్య
గ్రమ్ములౌ పలు ఊహపోహలు
పుండుపడ్డ తదీయ హృదయ
మ్మును మరింతగ కెల్కసాగెను.

"ఎరిగి యెరిగి హలాహలమ్మును
ఏ గతిని పానమ్ము సేతును.
ఎదుట నిల్చిన ఫణిఫణమ్మున
ఏ విధమ్మున కేలు సాతును.

నన్ను ప్రాణముకన్న మిన్నగ
నమ్మికొనియున్నాడు రాయడు.
న న్నపరదైవమ్ముగా మది
నెన్నుకొనియున్నాడు రాయడు.

ఆతనిన్ విడి యెచటికైనను
పోతినా ఇంకేమి యున్నది?
వెఱ్ఱియెత్తినవానివలె బెం
బేలుపడి తిరుగాడు రాయడు.

రేడు నా లోకన్నులను వె
ల్గించిన రసానందదీపము.
నేను రాయని విడిన మరు నిమి
షాన లోకము నరకకూపము.



అనుగురాణిని రాచకొల్వును
అఖిలరాజ్యము నైన నాకై
అవలద్రోసిన ప్రభువునే విడ
నాడ నా మనసెట్టు లాడును?

ఎటుల వాగ్దానమ్ము తీర్తును
ఎటుల రాయని వీడ నేర్తును
ఎందుకీ హృదయమ్ము నిచ్చితి
వీశ్వరా! ఈ సానిదానికి?"

ఈ విధిని ఎన్నో విధమ్ముల
భావనలతో రేయి గడచెను.
ఇరులపోలిక ఆమె ఊహల
కురుల చిక్కులుగూడ విరిసెను.

తూర్పువాకిట బాలభానుని
తొల్లికిరణము తొంగిచూచెను.
లకుమలో నొక వజ్రసంక
ల్పమ్ము వేళ్ళను దన్ని లేచెను.

ఆనాడు లకుమ రమ్యశరీరమున చండి
కాభయద సౌందర్యకాంతులు పిసాళించె.

ఆనాడు లకుమ నిర్వేణియై ఉన్మత్త
వాణియై గోపితగ్లానియై రూపించె.

కురులు విరబోసుకొని శిరసుపై ఒకపూల
చెండు నిడుకొని చంద్రశేఖరుడ నేననును.

అలికమున సిందూరతిలకమ్ము తీర్చి 'ఇది
గో యగ్నినేత్ర' మని రాయనిని బెదరించు.

గళమందు కస్తూరికారేఖలను దిద్ది
కాకోలకంఠ మిదిగో కనుము కనుమనును.

తన తనువునిండ నిలువున గీటు గీసుకొని
ఈవైపు అమృతమను ఆవైపు విషమనును.

లకుమచేష్టలు రాయనికి వింతగా తోచి
'ఇదియేమి అభినయమ్మే ప్రేయసీ' యనెను.

'అభినయము కాదు ఇది ఆగామి సూచక'
మ్మనబోయి లకుమ నాల్కను గొరికికొని నిల్చె.

'ఏమేమి' యని రాయ డామె కురులను దువ్వె.
'ఏమిలే' దని పల్కి ఆమె పొడిగా నవ్వె.



రాయ డామెను నిజోరఃపీఠిపై వ్రాల
గా లాగి 'పిచ్చిదానా లకుమ'యని పల్కె.

లకుమ రాయని వినీలశిరోజముల రేపి
'నిజమో మహారాజ! నే పిచ్చిదాన'ననె.

'ఓ ప్రియా! ఓసి ప్రణయోన్మాదినీ! నేటి
దిన మపూర్వమైన అనుభూతి నిచ్చితివి.'

'నాగుండె దోచుకొన్నదొరా! నిజమ్ము మన
బ్రతుకులో నే డపూర్వమ్మైన దినమురా.'

ఈరీతిగా రాయ డేది అడిగిన లకుమ
దానినే ఒకసమాధానమ్ముగా త్రిప్పె.

ఆనాటి అసురసంధ్యావేళ లకుమ ర
క్తాంబరము కట్టి రాయని కెదురుగా నిల్చె.

'ఇదియేమివేషమే మదవతీ' యన ఆమె
'శివతాండవమున కీ చీరయే తగు'ననియె.

లకుమ తొల్తగ శివాలాస్య మ్మభినయించె
రేని సుమనోంతరాళాన మధువూరించె.

శివ పరమశివుని పూజించినట్టుల రేని
పదములందున కోకనదములను వెదజల్లె,

మృడుని ఆకృతి దోప ఒడలెల్ల పొంగించె
డండండముక్కుమని డమరుకము పల్కించె.

ఖంగుమని మ్రోగు చిరుగంటలును గజ్జెలును
పటహబంభాది శబ్దమ్ములను విన్పించె.

ఆమెదేహమ్ము ఝుంఝూనిలమ్మటు తూగె
ఆమె అంగముల ప్రళయాబ్ధివీచులు రేగె.

తలపైన ఎఱ్ఱకల్వలు మంటలను పూచె
నొసట చెందిరబొట్టు కసుబుస్సుమని చూచె.

కను లెఱ్ఱబడిపోయె తను వెఱ్ఱబడిపోయె
ఇంతింత ఆమె మనసే యెఱ్ఱబడిపోయె.

నృత్యమందిరము శోణిత వర్ణితమ్మయ్యె
ఆమెలో అసురసంధ్యామూర్తి కననయ్యె.

ప్రభుని చిత్తాబ్జమ్ము పరికంపితమ్మయ్యె
కనులందు కారుచీకటులు గమ్మున ముసిరె.



లకుమ గజ్జెలు ఖణిల్లని విరిగి చెదరిపడె
ఆమె మేఖల పుటుక్కనుచు తెగి క్రిందబడె.

ఒక్కమాటుగ ఆమె ఒడిలోన చేయివేసె
నృపుని కనులం దొక మెరుపు తళుక్కున దూసె.

మరునిముసమున లకుమ ధరణిపై గూలె
చకితుడై రాజు ముందుకు దూకి వ్రాలె.

ప్రాణములు కదలిపోవగ రాయ డరచె
పడతియొదలో ఒక్క పిడిబాకు మెరిసె.

ప్రభువామె తలను చేతుల నిలిపె
'లకుమా' యనుచు బిగ్గరగ పిలిచె.

లకుమ బరువగు రెప్పలను విప్పె
రాయనికి పోవు ప్రాణము వచ్చె.

పాలసంద్రపు తరగలీల ఉప్పొంగి ఆ
మెను మాటిమాటికిని తనకనుల కద్దుకొనె.

లకుమ వదనముపైన రాహుగ్రహగ్రస్త
చంద్రబింబాంతస్థ చరమకళ కన్పించె.

ప్రభు డపుడు గగ్గోలుపడి ఏమియును తోచ
లేక ఎదలో దిగిన బాకు నూడంబెరికె.

ఆ మహాసాధ్వి రాయని కరాంభోరుహ
మ్ములలోన శాశ్వతమ్ముగ కనులుమూసుకొనె.

రాయనికి తన శరీరము, మనసు, సర్వమ్ము
పాతాళకుహరాన పడిపోయినటు తోచె.

తన జీవనిధిని నేలను గూల్చినట్టి ఛురి
కను కనుల నిప్పులొల్కగ చూచె రాయండు.

దాని పిడిచుట్టు పత్రమ్మొకటి కనిపించె
రక్తసిక్తాక్షరములను రేడు పఠియించె.

ప్రభువులోపల పట్టరాని దుఃఖమ్ము దుః
ఖమునుమించిన విస్మయము వెల్లువలు దూకె.

శిబిదధీచులను మించిన లకుమ త్యాగశీ
లమ్మునకు ప్రభుతనువు లజ్జా పిహితమయ్యె.

'ఓలకుమ! యెటనుంటివోనీవు? ఇంకెచట?
పరమసాధ్వీ జగత్ స్వర్ణాసనముపైన.



ఓ సఖీ! యేమందువో నీవు? ఇంకేమి?
వ్యష్టికన్నను దేశదృష్టియె గరిష్ఠమని.'

ఈవిధిని ప్రభువు వాపోవుచుండగ లకుమ
అందించు సందేశ మతని జాగృతుజేసె.

ప్రభువు కన్నులకు కన్పడె నపుడు కొండవీ
డును, మహారాజ్ఞియును, జనమహాంభోధియును.

నేటికిని లకుమ అందెల ఝణత్కారములు
వినిపించు కొండవీటను వీచు వాయువులు.

కొమరగిరిచరితమ్ము కొండవీటను శిశిర
మును సైతము వసంతముగ రూపు గట్టించు.

కొండవీటను పాదుకొన్నట్టి మట్టిలో
సైతమ్ము కర్పూరసౌరభమ్ములు వీచు.

# KARPOORA VASANTHA RAYALU

**-Dr. C. Narayana Reddy**

